విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

ఆదివారం 17 నవంబరు 2024 8 పేజీలు

గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

- డిసెంబరు నాటికి 2333 గృహ నిర్మాణాలు లక్ష్యం
- ఆదివారం అందుబాటులో ఉండాలి
- హౌసింగ్ కాలనీని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - రాజానగరం : పేద కుటుంబాల గృహ నిర్మాణాలు వేగవంతం చేసేందుకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు సమన్వయంతో ప్రతిఒక్కరు పనిచేయాలని, త్వరితగతిన గృహాలు పూర్తి చెయ్యాలని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మండలంలోని వెలుగుబంద హౌసింగ్ కాలనీని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీనిలో భాగంగా ఆ ప్రాంతంలో నిర్మించిన పలు గృహాలను, స్థలాలను పరిశీలించారు.దీనిపై స్థానిక అధికారులను పలు వివరాలు అడిగారు.సలహాలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పేదలంద రికీ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసేలా డిసెంబరు చివరి నాటికి 2333 ఇళ్ల నిర్మాణ లక్ష్యంగా పెట్టుకున్నామని, వాటిలో ఇంతవరకు 306 (13శాతం) పూర్తయ్యాయని, మిగిలిన లక్ష్యాలు సాధించడానికి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఆప్షన్ 3 కింద 3396 ఇళ్ళ నిర్మాణం చేపట్టాల్సి ఉండగా 683 పూర్తి కాగా మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. వారం వారం లక్ష్యాలను నిర్ణయించుకుని వాటిని సాధించాల్సి ఉందన్నారు. పట్టణ ప్రాంతాల్లో లబ్దిదారులు ఉండడం వల్ల మునిసిపల్ కార్పొరేషన్ సిబ్బంది సహకారం అందించాలని ఇన్చార్జి హౌసింగ్ పిడి కె ఎల్ శివ జ్యోతి విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ వెంట ఇన్చార్జి హౌసింగ్ పిడి కె ఎల్ శివ జ్యోతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ బీవీ గిరి,ఇతర జిల్లా, డివిజన్ మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

108 ఉద్యోగుల సమ్మెబాట

విశాలాంధ్ర- పాలకోడేరు : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 108 ఉద్యోగులంతా ఈనెల 25 నుంచి సమ్మె బాట పట్టనున్నారు. దీనికి కారణం ఉద్యోగులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా రాష్ట్ర నాయకులు సంబంధిత వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి కి, డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ ట్రస్ట్ సీఈఓకు సమ్మె నోటీసు ఇచ్చారు. రాష్ట్ర నాయకుల పిలుపుమేరకు శనివారం పాలకోడేరు 108 సిబ్బంది మండల తహసిల్దార్ కి, ఎంపీడీవో కి సంబంధిత సమ్మె నోటీసు ప్రతులను అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక 108 సిబ్బంది మాట్లాడుతూ 108 వ్యవస్థని నేరుగా ప్రభుత్వం నిర్వహించాలన్నది ప్రధాన డిమాండ్ అన్నారు. మధ్యలో దళారీ వ్యవస్థ ఉండటంవల్ల నిర్వహణ సంస్థలు మార్చే ప్రతిసారి 108లో పనిచేసే ఉద్యోగులు గ్రాడ్యుటీ, వార్షిక ఇంక్రిమెంట్లు, ఈఎల్ అమౌంట్ తదితర బెనిఫిట్స్ నష్టపోతున్నామన్నారు. నెలసరి వేతనాలు సకాలంలో వెయ్యకుండా మూడు నాలుగు నెలలు పెండింగ్ పెట్టడం వల్ల ▶మిగతా 2లో..

కలక్టరేట్ భవనాల స్థల పరిశీలన

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని శాశ్వత కలక్టరేట్, ఇతర ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు నేపధ్యంలో ఆయా భవనాల నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని పరిశీలించినట్టు జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి తెలియ చేశారు. శనివారం కలెక్టర్ పి. ప్రశాంతి స్థానిక జాంపేట పోలీస్ క్వార్టర్స్ సమీపంలో వున్న స్థలాన్ని అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ భవనాలు నిర్మాణం కోసం అనువైన ప్రదేశం గుర్తించడంలో భాగంగా పోలీసు క్వార్టర్స్ సముదాయానికి అనుకుని, స్వామీ థియేటర్ ఎదురుగా ఉన్న సుమారు 7 ఎకరాలకు పైగా ఉన్న స్థలాన్ని పరిశీలించారు. కలక్టరేట్‌తో పాటుగా ఇప్పటికే వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు, ఎన్ఐసి, వైటీసీ తదితర ▶మిగతా 2లో..

రైతులు ధాన్యం ఎక్కడైనా అమ్ముకోవచ్చు

జాయింటు కలెక్టరు టి.రాహుల్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర -భీమవరం: రైతులు ఎంపిక చేసుకున్న మిల్లులో ధాన్యాన్ని అమ్ముకోడానికి రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ధాన్యం కొనుగోలులో పశ్చిమ గోదావరి జిల్లా మొదటి స్థానంలో నిలిచేలా రైసు మిల్లర్లు సహకారం అందించాలని జాయింటు కలెక్టరు టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేటు జిల్లా జాయింటు కలెక్టరు ఛాంబరులో జిల్లాలో ధాన్యం కొనుగోలుపై సంబంధిత అధికారులు. రైసు మిల్లర్లతో జాయింటు కలెక్టరు సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రైతు సేవా కేంద్రాలు ద్వారా ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలన్నారు.రైతులు ఎంపిక చేసుకున్న మిల్లుకు ధాన్యాన్ని పంపే వెసులుబాటు రాష్ట్ర ప్రభుత్వం కల్పించినందున, ప్రతి రైతుకు అవగాహన కల్పించాలన్నారు.జిల్లాలో ఇప్పటివరకు 23 వేలు టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, 54 కోట్లు రూపాయలు ఆయా రైతులు బ్యాంకు ఖాతాలో జమచేశామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు ఎంతమంది రైతులు కోతలు కోశారు, ధాన్యం కల్లాల్లో ఎంత ఉందని అడిగి తెలుసుకున్నారు. ధాన్యంతో మిల్లు వద్దకు వచ్చిన వాహనాలను తక్కువ సమయంలో దిగుమతి చేసి పంపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బహిరంగ మార్కెట్లో ధాన్యం విక్రయించే రైతులకు కూడా కచ్చితంగా ప్రభుత్వ మద్దతు ధర అమలయ్యేలా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింటు కలెక్టరు ఆఆదేశించారు. అవసరమైన గన్ని బ్యాగులు, హమాలీలు, రవాణా సమకూర్చాలన్నారు. జిల్లా, డివిజన్, మండల, గ్రామస్థాయి కమిటీలు నిత్యం రైతులకు అవగాహన ▶మిగతా 2లో..

సిలబస్ పూర్తి కాకుండానే పరీక్షలకు సిద్ధమా?

- విద్యార్థుల జీవితాలతో చెలగాటం వద్దు
- ఏఐఎస్ఎఫ్ నేతృత్వంలో ధర్నా

విశాలాంధ్ర - రాజానగరం : విద్యార్థులకు పాఠాలు బోధించకుండనే (సిలబస్) పరీక్షలకు సిద్ధమా అంటూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) నాయకులు మండిపడ్డారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మండలంలోని ఆదికవి నన్నయ వర్సిటీ వద్ద ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల ఏఐఎస్ఎఫ్ అధ్యక్షులు, కార్యదర్శులు చింతలపూడి సునీల్, వెంకట్,సుందర్ శనివారం ధర్నా చేపట్టారు. దీనిలో భాగంగా వర్సిటీ సబ్ రిజిస్టర్ లింగారెడ్డి కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలతో ఆదికవి నన్నయ వర్సిటీ చెలగాట మాడుతుందన్నారు. సిలబస్ పూర్తి కాకుండానే పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారని మండిపడ్డారు. నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో సుమారుగా 500 అనుబంధ కాలేజీలు ఉన్నాయని వాటిలో ప్రైవేటు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలలో సెమిస్టర్ కు సంబంధించి సిలబస్ ఇంకా పూర్తి కాకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని వాపోయారు. సిలబస్ పూర్తి కాకుండా పరీక్షలకు ఏర్పాటు చేయడం ఏమిటని వర్సిటీ అధికారులు తీరుపై ధ్వజమెత్తారు. రెండు మరియు ఐదో సెమిస్టర్లు కి సంబంధించి ఈ నెల 22 నుంచి డిసెంబర్ 5 వరకు పరీక్షలు నిర్వ హిస్తున్నామని సబ్ రిజిస్టర్ లింగారెడ్డి తమకు చెప్పా రని, ప్రస్తుతం పరీక్షలు వాయిదా వేసి డిసెంబర్ 6న నిర్వహించాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ అభివృద్ధికి యుజిసి గ్రాండ్లు మంజూరు చేయాలని మరో డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు పవన్,భాను కార్తీక్, సతీష్, మణికంఠ, కుమార్, లోకేష్, సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు.

నకిలీ బంగారం ముఠా అరెస్ట్

రూ.15 లక్షల నగదు, నకిలీ బంగారు పూసలు స్వాధీనం

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : తమకు లంకె బిందెలు దొరికాయని, అందులో ఉన్న బంగారం తక్కువ ధరకు ఇస్తామని మాయమాటలు చెప్పి ఒక వ్యక్తిని నమ్మించి మోసం చేసిన నిందితులను అరెస్టు చేయడంతో పాటు వారి వద్ద నుండి రూ.15 లక్షల నగదును ముదినేపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు శనివారం ఏలూరులోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ కేసు వివరాలను వెల్లడించారు. కృష్ణా జిల్లా పెడన మండలం చెన్నూరు గ్రామానికి చెందిన పంద్రాజు రవీంద్ర కుమార్ గత నాలుగు సంవత్సరాల నుండి ముదినేపల్లి మండలం, శ్రీహరిపురం గ్రామంలో ఉంటూ చేపలు, రొయ్యల చెరువులు సాగు చేస్తున్నాడు. నెల్లూరు జిల్లా వెంకటగిరి మండలం మల్లూరుపేట గ్రామానికి దబ్బా ఈశ్వర్, బాణవత్తు చిన్న, చిత్తూరు జిల్లా వేంపాడు గ్రామంలోని ▶మిగతా 2లో..

నివేశన స్థలాలు ఇవ్వాలి

విశాలాంధ్ర -భీమవరం: ఎన్నికల సందర్భంగా పేదలకు నివేశన స్థలాలు, ఇళ్లపై కూటమి పార్టీలు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణాలపై పేదలకు న్యాయం చేయాలని ఈ నెల 18న సచివాలయాల వద్ద నిర్వహించే ధర్నా జయప్రదం చేయాలని జగనన్న నివేశనా స్థలాల లబ్ధిదారులకు కరపత్రాలు, వ్యక్తిగత దరఖాస్తులు పంపిణీ కార్యక్రమాన్ని సిపిఐ ఆధ్వర్యంలో శనివారం భగత్ సింగ్ నగర్, నెహ్రూ కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి సర్కారు అమలు జరపాలని, ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. 18న సచివాలయాల వద్ద జరిగే ధర్నాల్లో పెద్ద ఎత్తున పేదలు పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏలేటి ఆనంద్, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, సావిత్రి, వెంకాయమ్మ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలుకు 18న ఆశ వర్కర్ల ధర్నా

విశాలాంధ్ర- పాలకోడేరు : ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలు, జీవోలో తక్షణమే అమలు చేయాలని ఈనెల 18న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు పశ్చిమగోదావరి జిల్లా ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా కోశాధికారి లారెన్స్ కుమారి తెలిపారు. ఈ సందర్భంగా శనివారం మండల కేంద్రమైన పాలకోడేరులో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర యూనియన్ పిలుపుమేరకు ఈనెల 18న భీమవరం కలెక్టరేట్ వద్ద మహా ధర్నా నిర్వహిస్తున్నామని అన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మండల స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ప్రజా ప్రతినిధులను, అధికారులు కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నా వాటిని పట్టించుకునే నాధుడే కరువయ్యారన్నారు. ప్రతి ఒక్క ఆశ కార్యకర్త భీమవరం కలెక్టరేట్ వద్ద 18న జరిగే మహా ధర్నాల్లో పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని జిల్లావ్యాప్తంగా ఉన్న ఆశ కార్యకర్తలకు ఆమె పిలుపునిచ్చారు.

మెగా డీఎస్సీ -2024కు ఉచిత శిక్షణ

విశాలాంధ్ర -భీమవరం: జిల్లాలోని బి.సి., ఎస్సీ, ఎస్టీ, ఈ.బి.సి. సామాజిక వర్గాలకు చెందిన అభ్యర్థులకు ఆంధ్రప్రదేశ్ బి.సి. స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో డీఎస్సీ- 2024 పరీక్షలకు ఉచిత శిక్షణ నిమిత్తం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు బి.సి.సంక్షేమ సాధికార అధికారి జి.వి.ఆర్.కె.యస్.యస్. గణపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యర్థులు తమ దరఖాస్తును కలెక్టరేట్‌లోని జిల్లా బి.సి సంక్షేమ, సాధికారత అధికారి వారి కార్యాలయంలో అందచేయాలని సూచించారు. బి.సి., ఎస్సీ, ఎస్టీ కులాల వారు- 200 మందికి, ఈ.బి.సి కులాల వారు-20 మందికి రెండు నెలల పాటు ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ అందజేయనున్నట్టు తెలిపారు. అభ్యర్థులు తమ బయోడేటా 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, బి.ఈడీ, టీ.టీ.సి, టెట్ మార్కుల జాబితా, ఆదాయ, కుల ధృవీకరణ పత్రములు, ఆధార్, బ్యాంక్ పాస్ బుక్, రెండు పాస్ పోర్ట్ సైజు ఫోటోలు ఈ నెల 22వ తేదీ లోపు అందచేయాలని మరిన్ని వివరములకు 8247368943, 8106677598 నెంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

సీపీఐ సంతాపం

విశాలాంధ్ర - కామవరపుకోట : జీలకర్రగూడెం జమిందార్ పూర్వ సమితి మాజీ అధ్యక్షులు రాజా రాఘవరాజు సుబ్బరాజు సతీమణి సత్యవతమ్మ మృతికి సిపిఐ నాయకులు మామిళ్ళపల్లి వసంతరావు, టీవీఎస్ రాజు శనివారం ఒక ప్రకటనలో ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. శనివారం జీలకర్రగూడెంలోని సత్యవతమ్మ కుటుంబ సభ్యులను కలిసి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కంకిపాటి బుచ్చిబాబు, గుడ్డేటి సత్యనారాయణ,చలమాల శ్రీనివాసరావు, టి రాములమ్మ, గదుల సత్యనారాయణ,శెట్టి బాలాజీ, నల్లమోతుల శ్రీనివాసరావు తదితరులు సంతాపం తెలిపారు.

మంత్రి నాదెండ్లకు ఆర్టీసీ చైర్మన్ కృతజ్ఞతలు

విశాలాంధ్ర- ఏలూరు : ఆహార, పౌర సరఫరాలు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి, ఏలూరు జిల్లా ఇంచార్జి మంత్రిని శనివారం సెక్రటేరియట్ లోని ఆయన కార్యాలయంలో ఏపీఎస్ఆర్టీసీ రీజనల్ బోర్డ్ (విజయవాడ జోన్) చైర్మన్, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధికార ప్రతినిధి, రెడ్డి అప్పల నాయుడు మర్యాద పూర్వకంగా కలిశారు. నామినేటెడ్ పదవుల నియామకంలో భాగంగా సముచిత స్థానం కల్పించినందుకు మంత్రి నాదెండ్లకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రెడ్డి గౌరీ శంకర్, వీరంకి పండు, బొత్స మధు, ఎట్రించి ధర్మేంద్ర, జనసేన రవి తదితరులు పాల్గొన్నారు.

ముఠా అరెస్టు

(1వ పేజీ తరువాయి)

ఈశ్వర కాలనీకి చెందిన భూక్యా సాంబ కైకలూరు రూరల్ మండలం పరిధిలోని పలు చేపల చెరువుల రైతుల వద్ద పనిచేస్తున్నారు. రైతుల స్థాయిని అంచనా వేసుకొని వారిని మోసం చేద్దామనే ఉద్దేశంతో వీరు ఒక బృందంగా ఏర్పడ్డారు. ఇందులో భాగంగానే గతంలో పనిచేసిన రైతు రవీంద్ర కుమార్‌కు ఫోన్ చేసి తమకు లంకె బిందులు లభ్యమయ్యాయని, అందులో ఉన్న బంగారం తక్కువ ధరకు విక్రయిస్తామని చెప్పారు. బంగారం తనిఖీ చేసుకునేందుకు పలుమార్లు ఫోన్ చేయడంతో ఆ విషయాన్ని నమ్మిన నరేంద్ర ఈ ఏడాది అక్టోబర్ 23వ తేదీన సింగరాయపాలెం గ్రామానికి బంగారం తనిఖీ చేసుకునేందుకు బయలుదేరి వెళ్ళాడు. దీంతో ముందుగానే తమ వద్ద సిద్ధం చేసుకున్న బంగారపు పూసల దండలు రవీంద్రకు చూపించి అందులోని మూడు పూసలను తీసి తనిఖీ చేయించుకు రమ్మని చెప్పడంతో అది నిజమైన బంగారం అని తేలింది. దీంతో అడ్వాన్స్‌గా రూ.5 లక్షలు నిందితులకు అందజేసి మిగిలిన సొమ్ములు గడువు విధించారు. అనంతరం రవీంద్రను గుంటూరు జిల్లా వెంకటాచలం జాతీయ రహదారి సమీపంలోకి పిలిపించి ముందుగా వేసుకున్న పథకం ప్రకారం అతనిపై దాడి చేసి అతని వద్ద ఉన్న రూ.15 లక్షల రూపాయలను అపహరించి పరారయ్యారు. దీంతో రవీంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్పీ కిషోర్ ఆదేశాలపై ఏలూరు డిఎస్పీ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో కైకలూరు రూరల్ సీఐ రవికుమార్ పర్యవేక్షణలో ముదినేపల్లి, కలిదిండి, మండవల్లి ఎస్సైలు బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టి ఎంతో చాకచక్యంగా కైకలూరు పరిధిలోనే పనిచేస్తున్న నిందితులను నందివాడ మండలం పోలుకొండ గ్రామంలో వారి ఇంటి వద్ద గుర్తించి అరెస్ట్ చేసి వారి వద్ద నుండి రూ.15లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో నలుగురు ముద్దాయిల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్పీ వెల్లడించారు. ఈ సందర్భంగా కేసును ఛేదించిన సిఐ వి.రవి కుమార్, ఎస్సైలు వి.ఏసి.భద్రరావు, సూర్య రామచంద్రరావు, వి.వెంకటేశ్వరరావు, సిబ్బంది బి.నాగబాబు, ఏండి.షఫి, పి.పవన్ కుమర్, కే.నాగార్జున, ఎస్.రాంబాబు, బి. వెంకటేశ్వరరావు, ఎన్.నాగాంజ నేయులును ఎస్పీ కిషోర్ అభినందించారు.

అమ్ముకోవచ్చు

(1వ పేజీ తరువాయి)

కల్పించి మంచి సేవలు అందించాలని తెలిపారు. రైతులకు ఏదైనా సమస్య ఎదురైతే జిల్లా కలెక్టరేట్లో వివిధ శాఖల సమన్వయంతో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్ నెం.8121676653 నందు సంప్రదించాలని జాయింటు కలెక్టరు అన్నారు. కార్యక్రమంలో భీమవరం ఆర్డీఓ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, జిల్లా సివిల్ సప్లై మేనేజరు టి.శివరామప్రసాదు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వర రావు, డి యస్ ఓ యన్.సరోజ, ఏ యస్ ఓ యం.రవి శంకర్, సహాయక మేనేజరు పి.డి.యన్. సత్యనారాయణ,జిల్లా రైసు మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సామంతపూడి శ్రీరామరాజు, కార్యదర్శి కొత్త శ్రీనివాస్, డిస్ట్రిక్ ప్యాడి పొక్యూర్మెంట్ సభ్యులు, టెక్నికల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన

(1వ పేజీ తరువాయి)

భవన సముదాయాలు ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా నగరంలోనే కలక్టరేట్‌తో పాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించనున్నట్లు తెలిపారు. కలక్టర్ వెంట ఆర్‌డిఓ ఆర్. కృష్ణ నాయక్, ఆర్ అండ్ బి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమ్మెబాట

(1వ పేజీ తరువాయి)

కుటుంబ పరంగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇదే కాకుండా వైద్య ఆరోగ్య శాఖలో చేపడుతున్న ఎమర్జెన్సీ మెడికల్ టెక్నికల్ పోస్టులను 108 లో పనిచేసే మెడికల్ టెక్నీషియన్లకు అవకాశం కల్పించాలన్నారు. 108లో పనిచేసే పైలెట్లను అర్హతను బట్టి ఆర్టీసీలో అవకాశాలు కల్పించాలన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న అరబిందో సంస్థ తమకు రావలసిన వేతన బకాయిలు, వార్షిక ఇంక్రిమెంట్లు చెల్లించే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. ప్రస్తుతం తాము 12 గంటల డ్యూటీ రెండు షిఫ్ట్ లలో చేస్తున్నామని కార్మిక చట్టం ప్రకారం ఎనిమిది గంటల పని దినాలను అమలు చేయాలన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోతే రూ.20 లక్షల నష్ట పరిహారం ప్రభుత్వం చెల్లించాలని, రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి తమపై అదనపు భారాన్ని తగ్గించాలని, ప్రతి మండల కేంద్రంలో ఉన్న 108 వాహనానికి, సిబ్బందికి కనీస అవసరాలతో కూడిన శాశ్వత భవనాలను ఏర్పాటు చేయాలని, ప్రస్తుతం కండిషన్లో లేని వాహనాలకు మరమ్మతులు చేయించి ఉద్యోగుల, క్షతగాత్రుల ప్రాణాలకు భద్రత కలిగించాలని తదితర డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచినట్టు తెలిపారు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం స్పందించకపోతే తప్పనిసరి పరిస్థితుల్లో ఈనెల 25వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 108 ఉద్యోగులు సమ్మెకు వెళ్తున్నట్టు చెప్పారు. ఈ ప్రధాన డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని పాలకోడేరు మండల డిప్యూటీ తహసీల్దారు సూర్యనారాయణ రాజుకు, ఎంపీడీవో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో 108 సిబ్బంది ఈఎంటి సీతారత్నం, పైలెట్ వెంకట్రావు పాల్గొన్నారు.

విద్యార్థులకు చెస్ పోటీలు

విశాలాంధ్ర- పాలకోడేరు : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శనివారం పాలకోడేరు మండలం గొల్లల కోడేరు శాఖ గ్రంథాలయంలో పాఠశాల విద్యార్థులకు చెస్ పోటీలు గ్రంథా లయ అధికారి జి. బాలరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గొల్లలకోడేరు ఎంపీపీఎస్ నెం.1 స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు జి. నెహ్రూ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ మేధస్సుకు పదును పెట్టుకోవాలని, గ్రంథాలయం ఆధ్వర్యంలో ఇలాంటి చెస్ పోటీలు పెట్టడం వల్ల విద్యార్థుల మెదడు చురుకుగా పనిచేస్తుందన్నారు, ఈ విధమైన పోటీలు పెట్టి విద్యార్థులలో నైపుణ్యాన్ని వెలికి తీస్తున్న గ్రంథాలయ అధికారిని అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర - కలిదిండి: విద్యార్థులలో నైపుణ్యతను మెరుగుపరిచేందుకు వ్యాసరచన పోటీలు దోహదపడతాయని రిటైర్డ్ ఉపాధ్యా యులు శ్రీనివాస రావు తెలిపారు. శనివారం స్థానిక శాఖ గ్రంథాల యంలో 57వ జాతీయ గ్రంథా లయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలు గురించి వివరించారు. పుస్తక పఠనం అలవర్చుకుంటే జ్ఞాపక శక్తిని పెంపొందించుకునేందుకు దోహదపడుతుంద న్నారు. సోషల్ మీడియా వల్ల కలిగే నష్టాల పై వ్యాసరచన పోటీలు నిర్వహించగా వివిధ పాఠశాలల నుంచి 70 మంది విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథా లయ శాఖ అధికారి జె. రమేష్ బాబు, పిఈటి మల్లేశ్వరరావు, సిబ్బంది పురుషోత్తం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన గనులు

విశాలాంధ్ర -భీమవరం: గ్రంథాలయాలు విజ్ఞాన గనులని, పుస్తక పఠనం జీవితాన్ని ఇస్తుందని పలువురు వక్తలు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాల యంలో శనివారం బాల లకు క్విజ్, పుస్తక పఠనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లా డుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో గ్రంథాలయాలు ప్రజలను సంఘటితం చేశాయని గుర్తు చేశారు. గ్రంథాలయాల ద్వారానే వ్యక్తిత్వ వికాసం, జీవిత గమనానికి పునాదులు ఏర్పడతాయని వారు పేర్కొన్నారు. తొలుత డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్, అయ్యంకి వెంకట రమణయ్య, పాతూరి నాగభూషణం చిత్ర పటాలకు పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రిటైర్డ్ డిఈఓ ఇందుకూరు ప్రసాద్ రాజు, డాక్టర్ ఎస్.సత్యనారాయణ రాజు, డాక్టర్ ఎ.నరసింహ రాజు, డాక్టర్ కె.వి.సుబ్బరాజు, రామనాగేశ్వరరావు విద్యార్థులు, చదువరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళులు

విశాలాంధ్ర-లింగపాలెం: గ్రంథాలయాల ఏర్పాటుకు కృషి చేసిన మహాత్ముల సేవలు ఎనలేనివని ధర్మాజీగూడెం పంచాయతీ కార్యదర్శి స్వరాజ్యలక్ష్మి అన్నారు. గ్రంథాలయ వారోత్స వాలలో భాగంగా ధర్మాజీగూడెంలో ఉద్యమ ప్రముఖులైన వెంకటరమణయ్య, సర్వోత్తమరావు, రంగనాథన్, నాగభూషణం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ఆధునిక కాలంలో సైతం గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని వివరించారు. గ్రంథాలయాల ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులువెంకటరమణ,లతీఫ్ పాల్గొన్నారు.



రైతుల అవసరాలను గుర్తించండి

జాయింట్ కలెక్టర్ పి.ధాత్రి రెడ్డి

విశాలాంధ్ర-ఏలూరు: 71వ అఖిల భారత సహకార వారోత్సవాల సందర్భంగా శనివారం స్థానిక జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి సహకార పతాక ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా జెసి పి.ధాత్రిరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో వున్న సన్న, చిన్నకారు రైతులకు అందుబాటులో ఉంటూ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, సహకార సంఘాలు విస్తృత సేవలు అందిస్తున్నాయన్నారు.రైతుల, సభ్యుల అవసరాలను గుర్తించి సకా లంలో సేవలు అందుబాటులోనికి తీసుకు రావాలని పి.ఎ.సి.ఎస్.లు కంప్యూటరీకరణ సకాలంలో పూర్తి చేయాలన్నారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు, పి.ఎ.సి.ఎస్.లు సమన్వయంతో సిబ్బంది అందరూ సమిష్టికృషితో పనిచేసి ఏలూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు పూర్వ వైభవమును తీసుకొని రావాలన్నారు. జిల్లా సహకార అధికారి ఆరిమిల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలోని సహకార సంఘాల సిబ్బంది, బ్యాంకు సిబ్బంది, సహకార శాఖ అధికారులు సమిష్టిగా పనిచేస్తామని తెలిపారు. సహకార వారోత్సవాల ఇన్‌చార్జ్ ఆర్.శ్రీని వాసరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు సహకార వ్యవస్థ ద్వారా స్థిరమైన జీవనోపాధి సృష్టించుటకు వారి ఆర్థిక అభివృద్ధికి కీలకంగా వ్యవహరించాలని కోరారు. ఈ సందర్భంగా బ్యాంకు ఉద్యోగులు, సహకార గీతాలాపన చేసి బ్యాంకు సిబ్బందితో సహకార ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సహకార శాఖ అధికారులు, బ్యాంకు ఉన్నతాధికారులు,సిబ్బంది, పి.ఎ.సి.ఎస్.ల సిబ్బంది ఎంతో ఉత్సాహంలో పాల్గొన్నందుకు బ్యాంకు సి.ఇ.ఓ. కృతజ్ఞతలు తెలియజేసారు.

గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళులు

విశాలాంధ్ర-ఏలూరు: 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శనివారం గ్రంథాలయ పితామహులు,గ్రంథాలయ ఉద్యమకారులు,డాక్టర్ ఎస్. ఆర్.రంగనాథన్, అయ్యంకి వెంకట రమణయ్య, పాతూరి నాగభూషణం చిత్రపటా లకు వయోజన విద్య అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఆర్. విజయకుమార్, ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ రజనీ తదితరులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్ బాబు అధ్యక్షత వహించారు. అనంతరం టీమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు యుఎన్‌వి సత్యనారాయణ,జనరల్ సెక్రెటరీ ఎస్.గణపతి రాజు,జాయింట్ సెక్రెటరీ జివివి. నరసింహారావు, పబ్లిసిటీ సెక్రెటరీ అయినాల శ్రీనివాసరావు, సీనియర్ పాత్రికేయులు బి.కె.అయ్యంగార్, డిప్యూటీ లైబ్రేరియన్ ఎ. నారాయణ రావు, జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షల నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

విశాలాంధ్ర-ఏలూరు: లింగ నిర్ధారణ పరీక్షల నియంత్రణా చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.శర్మిష్ట అన్నారు. శనివారం డిఎంహెచ్ఓ ఛాంబర్‌లో డిఎంహెచ్ఓ శర్మిష్ట అధ్యక్షతన జిల్లా అడ్వైజరీ కమిటీ సమావేశం (పిసిఅండ్ పిఎన్ డిటి యాక్ట్) జరిగింది. ఈ సమావేశంలో డిఎంహెచ్ఓ శర్మిష్ట మాట్లాడుతూ పిసిఅండ్ పిఎన్ డిటి యాక్ట్ జిల్లాలో పటిష్టంగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. లింగనిర్ధారణ పరీక్షల నియంత్రణ చట్టంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 100 స్కానింగ్ సెంటర్లు పనిచేస్తున్నట్లు తెలిపారు. కొత్తగా జంగారెడ్డిగూడెం,తినేత్రా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి స్కానింగ్ కొరకు కొత్తగా ధరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. దీనిని ఆమోదించినట్లు తెలిపారు. సమావేశంలో గైనకాలజిస్టులు డాక్టర్ కె.భాను, శైలజ, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ వైవి. శివరామకృష్ణ, డాక్టర్‌కె.భార్గవి, డాక్టర్‌రోహిత్, ప్రోగ్రాం ఆఫీసరు డి.నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

18న సచివాలయాల వద్ద ధర్నా

సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

విశాలాంధ్ర -భీమవరం: పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని, ఇళ్ల నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18న సీపీఐ ఆధ్వర్యంలో సచివాలయాల వద్ద నిర్వహించ తలపెట్టిన ధర్నాలు, జగనన్న నివేశనా స్థలాలు పొందిన వారిచే దరఖాస్తులు సమర్పణ కార్యక్రమాలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. శనివారం భీమవరం రూరల్ మండలం నాగిడిపాలెం గ్రామంలో జగనన్న నివేశనా స్థలాల లబ్ధిదారులకు కరపత్రాలు, వ్యక్తిగత దరఖాస్తులు పంపిణీ కార్యక్రమాన్ని సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ వైసీపీ పాలనలో పేదలకు పట్టణ ప్రాంతాల్లో సెంటు, గ్రామీణ ప్రాంతాల్లో సెంటున్నర ఇచ్చిన చాలీచాలని ఇంటి స్థలాలు స్థానే తాము పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇళ్ళ స్థలాలు

ఇస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం అనువుగాని చోట స్థలాలు కేటాయించి చేతులు దులుపుకుని, వాటిస్థానే అనుకూలంగా ఉన్న ప్రాంతాల్లో స్థలాలు ఇవ్వాలని, ఐదు లక్షల రూపాయలు ఇంటి నిర్మాణానికి ఇవ్వాలని, ఇసుక, సిమెంట్, ఐరన్, ఇతర నిర్మాణ సామాగ్రి ఉచితంగా అందచేయాలని భీమారావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ భీమవరం రూరల్ మండల కార్యదర్శి ఎం.సీతారాం ప్రసాద్, సీపీఐ నాయకులు నాగిడి నాగరాజు, నాగిడి పాండు రంగారావు, తిరుమాని ధర్మరాజు, నాగిడి రామారావు, నాగిడి వెంకటేశ్వరరావు, నాగిడి గోవింద్, నాగిడి శాంతమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణతో రోడ్డు ప్రమాదాలు

ట్రాఫిక్ సమస్యలపై సమీక్ష

విశాలాంధ్ర- ఉంగుటూరు : ఉంగుటూరు మండలంలోని నారాయణపురం జంక్షన్ వద్ద, నారాయణపురం నుంచి గణపవరం వెళ్ళు మార్గంలో అనేక చోట్ల ఆక్రమణలు ఎక్కువ ఉండటం వల్ల, వాటివలన తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిపై పలువురు మండల పరిషత్ అధికారులకు ఫిర్యాదులు చేయటంతో శనివారం ఉంగుటూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి జిఆర్ మనోజ్ అధ్యక్షతన ట్రాఫిక్ సమస్యపై సమీక్ష సమావేశం నిర్వహించారు. రహదారికి ఇరువైపులా ఉన్న గృహ యజమానులు షాపు యజమానులు ఎవరికి వారు ఆక్రమణను స్వచ్ఛందంగా తొలగించు కోవలసిందిగా తద్వారా ట్రాఫిక్‌కు

అంతరాయం లేకుండా పోలీస్ శాఖ వారికి సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. పంచాయతీ సిబ్బంది ఆక్రమణదారు లందరికి నోటీసులు మంజూరు చేసి ఆక్రమణలను తొలగించడానికి అన్ని శాఖలు సమిష్టి కృషితో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు తహసిల్దార్ వై.పూర్ణ చంద్ర ప్రసాద్, చేబ్రోలు ఎస్సై సూర్య భగవాన్, పంచాయతీ విస్తరణాధికారి చంద్రశేఖర్, పంచాయతీ, రెవెన్యూ, సర్వే సిబ్బంది పోలీస్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించాలి

విశాలాంధ్ర-లింగపాలెం: గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక ప్రధానమని దీన్ని రూపొందించి అమలు చేసే బాధ్యత కార్యదర్శులు, సిబ్బందిపై ఉందని ఎంపీడీవో వాణి, మండల పంచాయతీ విస్తరణ అధికారి రత్నకుమార్ తెలిపారు. దీనికి సంబంధించి ఇటీవల ఒకరోజు జరిగిన అవగాహన సదస్సులో పలు విషయాలు సూచించినట్లు వెల్లడించారు. వీటిని ఏమాత్రం అమలు చేస్తున్నారనే విషయాలపై శనివారం ఇరువురు అధికారులు పంచాయతీల వారీగా పరిశీలించారు. గ్రామాలలో మౌలిక వసతులు కల్పించడంతోపాటు పరిశుభ్రతపై ప్రజలను భాగస్వాములను చెయ్యాలని కోరారు. అభివృద్ధి చేసిన పంచాయతీలకు రూ.1 కోటిని ప్రోత్సాహ బహుమతిగా అందించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే ఇటువంటి ప్రోత్సాహం వల్ల పంచాయతీలలో కావలసిన మరిన్ని సదుపాయాలను కల్పించుకునే అవకాశం ఉందని తెలిపారు. గ్రామాల అభివృద్ధిలో

సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండకుండా కీలకంగా వ్యవహరించాలని సూచించారు. పంచాయతీలో జరిగే పనులపై నిత్యం పర్యవేక్షణ ఉంటుందని నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

వివాహిత ఆత్మహత్య

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం : అత్తింటి వేధింపులు తట్టుకోలేక ఏలూరు కాలువలో దూకి వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం పట్టణంలో చోటుచేసుకుంది.మృతురాలు వైష్ణవికి చింతలపూడికి చెందిన విప్రో సైంటిస్ట్ నరేంద్రబాబుతో మార్చి 2023 లో వివాహం జరిగింది. తండ్రిలేని ఇద్దరు కుమార్తెలను తల్లి మంచి చదువులు చదివించింది. పెద్ద కుమార్తె వైష్ణవిని కట్నకానుక లతో వైభవంగా వివాహం జరిపించారు.. పెళ్లయిన ఆరు నెలలకే అదనపు కట్నం కోసం అత్తింటి వేధింపులు మొదలయ్యాయని బంధువులు తెలిపారు. పలుమార్లు పెద్దల సమక్షంలో,ఇటు పోలీసుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇప్పించినా అత్తింటి వారిలో ఎలాంటి మార్పు రాలేదని బంధువులు తెలుపుతున్నారు. గత ఎనిమిది నెలలుగా ఇంట్లోనే ఉంటుందని, నాలుగు రోజుల క్రితం ఫోన్లో భర్త వేధింపులకు గురిచేయడంతో మనస్తాపం చెందిన వైష్ణవి రాత్రి గుడికి వెళ్తొస్తానని చెప్పి ఏలూరు కాలువలో దూకి ఆత్మహత్య చేసుకుంది. దీనిపై సమాచారం అందుకున్న పోలీస్ సిబ్బంది వైష్ణవి కోసం గాలింపు చర్యలు చేపట్టగా లెప్రసీ కాలనీ వద్ద మృతదేహాన్ని కనుగొన్నారు. మృతదేహాన్ని స్థానిక తాడేపల్లిగూడెం ఏరియా హాస్పిటల్‌కు పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతికి కారణమైన భర్త నరేంద్రబాబు, అత్తమామలు వెంకటకృష్ణ, నాగమణి ఆడపడుచు శ్రావణిని కఠినంగా శిక్షించి న్యాయం చేయాలని బంధువులు కోరుతున్నారు.స్థానిక శాసనసభ్యులు కుమారుడు బొలిశెట్టి రాజేష్ ఏరియా ఆసుపత్రికి వచ్చి మృతురాలి కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు.

కైలాషికి నేషనల్ స్కూలు సాయం వెలకట్టలేనిది

ఎమ్మెల్యే డాక్టర్ కామినేని

విశాలాంధ్ర-కైకలూరు : అనారోగ్యంతో వెంటిలేటర్పై ఉన్న నేషనల్ స్కూలు విద్యార్థిని భట్రాజు భూపిక కైలాషికి స్కూలు విద్యార్థులు, యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం అందించిన సాయం వెలకట్టలేనిదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ కొనియాడారు. నేషనల్ స్కూల్ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న భట్రాజు భూపిక కైలాషి మెదడులో రక్తం గడ్డ కట్టడంతో తీవ్ర అనారోగ్యంతో హైదరాబాదులోని కిమ్స్ ఆసుపత్రిలో గత కొన్ని రోజులుగా వైద్యసేవలు పొందుతూ ప్రస్తుతం వెంటిలేటర్‌పై ఉంది. కైలాషి తండ్రి భట్రాజు ధర్మరాజు డ్రైవర్‌గా పని చేస్తున్నారు. వారిది పేద కుటుంబం. కైలాషి ఆరోగ్యానికి ఇప్పటికే రూ. 25 లక్షలు ఖర్చు చేశారు.ఆర్థిక స్తోమత అంతంత మాత్రంగా ఉన్నా తమ శక్తికి మించి రూ.25 లక్షలు వరకు ఖర్చుచేసినా ఇంకా పూర్తిస్థాయిలో ఆమె కోలుకోలేదు. దీంతో భట్రాజు భూపిక కైలాషికి సాయం చేయాలనే ఆలోచనతో నేషనల్ స్కూల్ విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం తమవంతు సాయమందించ టంతోపాటు విద్యా ర్థులు పలువురి నుంచి విరాళాలు సైతం సేకరించి రూ. 3.61లక్షలు సమీకరించారు. సదరు మొత్తాన్ని శనివారం స్కూలు వద్ద కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేయాలని కోరుతూ కైకలూరు నియోజకవర్గ యాదవ సంఘం అధ్యక్షుడు కరేటి శ్రీహరికి స్కూలు విద్యార్థులు, స్కూలు కరస్పాండెంట్ గురజాడ చంద్రమోహన్ దంపతులు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ అనారోగ్యంతో ఉన్న చిన్నారి కోసం తోటి విద్యార్థులు స్పందించిన తీరుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గురజాడ చంద్ర మోహన్ దంపతులతోపాటు, ఎంపిపి అడివి వెంకట కృష్ణమోహన్,వైస్ ఎంపిపి ఎండి జహీర్,పట్టణ సిఐ కృష్ణ, ఎన్డీఏ కూటమి నాయకులు పూల రామచంద్రరావు (రాజీ), కొల్లి బాబీ తదితరులు పాల్గొన్నారు.

108 సిబ్బంది సమ్మెబాటకు సన్నద్ధం

విశాలాంధ్ర - పెనుమంట్ర: అత్యవసర సమయాల్లో రోగులు, క్షతగాత్రుల ప్రాణాలు కాపాడడంలో కీలకంగా వ్యవహరించే 108 వాహన ఉద్యోగులు సమ్మెకు సన్నద్ధమవుతున్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని లేకుంటే ఈనెల 25 అర్ధరాత్రి నుంచి సమ్మె చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పెనుమంట్ర మండలంలో విధులు నిర్వహిస్తున్న 108 సిబ్బంది శనివారం ఎంపీడీవో, తహసీల్దారు లకు సమ్మె నోటీసు అందజేశారు.

అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలు పంపిణీ చేయాలి

విశాలాంధ్ర - కామవరపుకోట: అర్హులైన పేదలందరికీ మూడు సెంట్ల ఇంటి స్థలాన్ని, ఇంటి నిర్మాణానికి అవసరమైన మెటీరియల్స్‌ను ఉచితంగా పంపిణీ చేయాలని మండల సిపిఐ కార్యదర్శి టీవీఎస్ రాజు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కామవరపుకోట శివారు కొండగూడెం గ్రామంలో ఇల్లు లేని పేదలను సమావేశపరిచి, ఇంటి స్థలం దరఖాస్తులను పూర్తి చేసి వారికి అందజేశారు. సిపిఐ, బి కే యం యు రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో ఇళ్ళలేని పేదలకు ఇంటి స్థలాల కోసం దరఖాస్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కొండగూడెం శాఖ కార్యదర్శి మందపాటి ధర్మారావు, రాజు, నవ్య, మల్లమ్మ, ఏసు తదితరులు పాల్గొన్నారు.

పదవులు పొందిన ప్రజా ప్రతినిధులకు శుభాకాంక్షలు

భవన నిర్మాణ కార్మిక సంఘం

విశాలాంధ్ర -తాడేపల్లిగూడెం: :పశ్చిమగోదావరి జిల్లాకు అరుదైన గౌరవం తీసుకొచ్చిన ప్రజా ప్రతినిధులకు పశ్చిమగోదావరి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం తరపున అధ్యక్ష, కార్యదర్శులు బొల్లాడ నాగరాజు, పోలిరాతి ఆదినారాయణ జిల్లా సంఘం నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు (డిప్యూటీ స్పీకర్), తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శీను (విప్),నరసాపురం ఎమ్మెల్యే నాయక్ (విప్) పదోన్నతి పొందడం శుభ పరిణామం అన్నారు. జిల్లాకు మంచి రోజులు వచ్చాయని ఆశిస్తున్నామన్నారు. జిల్లాలో భవన నిర్మాణ కార్మికుల కోసం ఎంతో కృషి చేస్తున్నారని, కార్మికుల ఉన్నతికి అభివృద్ధికి తోడ్పడుతున్నారని, కార్మికులందరి తరపున జిల్లా నాయకులు శిరిగినీడి నాగేశ్వరరావు, గంట కంభేశ్వరరావు, పోతురాజు, వెంకట రామకృష్ణ ,పోలిశెట్టి ప్రసాద్, బి.వి శ్రీను, దువ్వా శ్రీనివాస్,రాసాబత్తుల అనుకుమార్, పడాల శ్రీనివాస్, టుడే సాయి బాలాజీ, కొక్కిరిమెట్టి సత్తిబాబు, అబ్బిరెడ్డి నగేష్, ఉప్పులూరి కృష్ణ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

జర్నలిస్టులకు సత్కారాలు

విశాలాంధ్ర- భీమడోలు: సమాజ నిర్మాణంలో పాత్రికేయుల పాత్ర గొప్పదని భీమడోలు ఎస్ఐ వై.సుధాకర్ అన్నారు. శనివారం భీమడోలు మాధురి కళాశాలలో జాతీయ పత్రికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్ పెనుమూడి బాలు అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఐ సుధాకర్ మాట్లాడుతూ వార్తలను, ఇతర సమాచారాన్నీ సేకరించి ప్రజలకు అందించేవారు పాత్రికేయులన్నారు. సమాజ నిర్మాణంలో జర్నలిస్ట్ ల పాత్రపై కళాశాల విద్యార్థులకు వివరించారు. కరోనా సమయంలోనూ పాత్రికేయుల సేవలు మరువలేనివని,ప్రజా శ్రేయస్సుకు జర్నలిస్టులు పనిచేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మండలానికి చెందిన జర్నలిస్ట్ లను కళాశాల నిర్వాహకులు, ఎస్ఐ సుధాకర్ సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ లు హజరత్, డేవిడ్, మూర్తి, నారాయణ, సలాది శివ, శ్రీరామ్ , శంకర్ , ప్రిన్సిపాల్ అశోక్, కేసరి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సు

విశాలాంధ్ర -భీమవరం: మహిళలు తమ పరిరక్షణ కొరకు ఏర్పడిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, మహిళలకు అన్యాయం జరిగితే జాతీయ స్థాయి నుండి మండల స్థాయి వరకూ కోర్టుల ప్రాంగణంలో న్యాయ సేవా సంస్థలు ఉన్నాయని, ఉచిత న్యాయ సహాయం అందజేస్తామని భీమవరం 3వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్ ఎం.ఏ.సోమశేఖర్ అన్నారు. జాతీయ మహిళా కమిషన్ సౌజన్యంతో మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో "విధాన్ సే సమాధాన్" శీర్షికన వీరవాసరం సచివాలయంలో మహిళా చట్టాలపై జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. భీమవరం పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి డాక్టర్ బి.లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ రాజ్యాంగం మహిళలకు ప్రత్యేక హక్కులను కల్పించిందని, వారి హక్కులకు భంగం కలిగితే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని, అక్కడ కూడా న్యాయం జరగకపోతే న్యాయస్థానాలను గానీ న్యాయ సేవా సంస్థను గానీ సంప్రదించి న్యాయం పొందవచ్చని" అన్నారు. మహిళ లైంగిక వేధింపుల నిరోధక చట్టం, మహిళలకు ఆస్తి హక్కు చట్టం, మహిళల అపహరణ, అత్యాచారం, లైంగిక దాడి, యాసిడ్ దాడి, వరకట్న వేధింపులు, వరకట్న చావులు, గృహ హింస తదితర చట్టాలపై న్యాయమూర్తులు మాట్లాడారు. కార్యక్రమంలో న్యాయాధి కారులు డి.ధనరాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు యేలేటి న్యూటన్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి బి.సుజాత రాణి, తహసిల్దార్ రామాంజనేయులు, మండల పరిషత్ అధికారి కె.కిరణ్ కుమార్, మహిళా న్యాయవాదులు ఎన్.సత్య విజ్ఞాన దేవి, ఎం.చిత్రభాను, రూరల్ సిఐ బి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించాలి

విశాలాంధ్ర -తాడేపల్లిగూడెం: ఇల్లు లేని పేదలకు గ్రామాలలో 3 సెంట్లు పట్టణ ప్రాంతాలలో 2 సెంట్లు భూమి ఇచ్చి, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల కేటాయించాలని సిపిఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సిపిఐ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 18న ఇళ్ల స్థలాల కొరకు సచివాలయాల వద్ద వ్యక్తిగత అర్జీల సమర్పించే కార్యక్రమం జరుగుతుందని, దీనిలో భాగంగా కేస్ కాలనీలో ఇల్లు లేని పేదలతో వ్యక్తిగత అర్జీలు తయారుచేసే కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మండల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రజలకు మూడు సెంట్లు స్థలం ఇవ్వాలని కోరితే గ్రామాల్లో సెంటున్నర, పట్టణాల్లో సెంటు ఇచ్చి, వాటి నిర్మాణానికి డబ్బులు కూడా ఇవ్వలేకపోయారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం పట్టణాల్లో రెండు సెంట్లు , గ్రామాల్లో మూడు సెంట్లు స్థలం కేటాయించాలని నిర్మాణానికి రూ.5 లక్షలు అందచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వడ్డది మేరీ, మాసా బాబురావు లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆశ్రం ఆసుపత్రిలో అరుదైన లాపరోస్కోపిక్ సర్జరి

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు ఆశ్రం ఆసుపత్రిలో లేప్రోస్కోపిక్ సర్జరీ ద్వారా కణితి తొలగించినట్టు ఆసుపత్రి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ కె.హనుమంతరావు తెలిపారు. శనివారం స్థానిక ఆశ్రమం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. హనుమంతరావు తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటక ప్రాంతంలో నివసించే, స్థానిక ప్రకాశరావుపాలెం గ్రామానికి చెందిన సత్యవతికి అనియంత్రిత మధుమేహంతో బాధపడుతూ, చికిత్స నిమిత్తం ఏలూరులో సంప్రదించగా, పాంక్రియాస్ గ్రంధిలో కణితి ఏర్పడినట్లు వైద్యులు గుర్తించారన్నారు. ఆశ్రం హాస్పిటల్స్‌లో సర్జికల్ గ్యాస్ట్రో విభాగానికి చెందిన డాక్టర్ టి.వి. కృష్ణవర్ధన్‌ను సంప్రదించగా, పేషెంటుకు అవసరమైన పరీక్షలు నిర్వహించి క్లోమగ్రంధి (పాంక్రియాస్)లో కణితి ఏర్పడిందని గుర్తించినట్లు తెలిపారు. ఎటువంటి నష్టం కల్గించకుండా ఆపరేషన్ ద్వారా కణితి తొలగించాలని సూచించారు. పాంక్రియాస్ మనిషి పొట్ట భాగంలో చాలా వెనుక భాగాన ఉంటుందని, ఓపెన్ విధానంలో ఆపరేషన్ ను పొట్టకోసి చేస్తే విపరీతమైన నొప్పితో పాటు, కోలుకోవటానికి ఎక్కువ రోజులు సమయం పడుతుందని తెలిపారు.లాపరోస్కోపిక్ సర్జరి విధానంలో చేస్తే పేషెంట్ త్వరగా కోలుకోవటంతో పాటు, మరుసటి రోజు నుండే ఆహారం తీసుకోవడం, 3వరోజునే పేషెంటను డిశ్చార్జ్ చేయడం కూడా జరుగుతుందని డాక్టర్ పేషెంట్కు సూచించారు. సత్యవతి,కుటుంబ సభ్యుల అంగీకారంతో ఈనెల 7న లాపరోస్కోపిక్ విధానం ద్వారా స్ప్లీన్ ప్రిజర్వింగ్ డిస్టల్ ప్యాంక్రియాటెక్టమి సర్జరి చేశారు. ఇటువంటి అడ్వాన్స్ లాప్రొస్కోపిక్ సర్జరిని ఏలూరు జిల్లాలోనే చేసినట్టు తెలిపారు.మెట్రో నగరాలకు పరిమితమైన ఇటువంటి అడ్వాన్స్ లాపరోస్కోపిక్ సర్జరిని చాలా అరుదుగా పెద్ద నగరాలలో చేస్తారని, అయితే ఏలూరు జిల్లాలో తొలిసారిగా ఆశ్రమం ఆసుపత్రిలో చేయడం జరిగిందని హనుమంతరావు తెలిపారు.

పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు ఇవ్వాలి

సీపీఐ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: పేదలకు ఇళ్ల స్థలాలు ఇల్లు నిర్మాణం కోసం భారత కమ్యూనిస్టు పార్టీ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈనెల 18 తేదీన సోమవారం జంగారెడ్డిగూడెం మండలంలోని అన్ని గ్రామ వార్డు సచివాలయాల వద్ద పేదలతో వ్యక్తిగత అర్జీలు అందించే కార్యక్రమం

జరుగుతుందని సిపిఐ మండల కార్యదర్శి జంపన వెంకటరమణ రాజు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్య దర్శి కుంచె వసంత రావు తెలిపారు. జంగారెడ్డి గూడెం మండలంలోని పలు గ్రామాల్లో సిపిఐ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శనివారం పర్యటించి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికలు ముందు చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు గ్రామాల్లో 3 సెంట్లు పట్టణాల్లో 2 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు నాయుడు అధికారం లోకి వచ్చి 5 నెలలు పూర్తి కావస్తున్నప్పటికి ఇళ్ల స్థలాలు గురించి మాట్లాడటం లేదన్నారు. మరో వైపు నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగటం, పెట్రోల్ డీజిల్ వంటగ్యాస్ ధరలతో సామాన్య ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టణాల్లో నివాసాలకు అనుగుణంగా రెండు సెంటు స్థలం, గ్రామాల్లో మూడు సెంట్ల స్థలాలను ఇచ్చి పక్కా ఇళ్లకు ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని రమణ రాజు ,వసంతరావు లు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చిలంతరాజుల శ్రీను, తాళ్లూరి నాగరాజు, వడ్లమనాటి శ్రీను, తివారీ మంగ, హనుమంతు, కలకొండ దేవి, మాగంటి వెంకట లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

బాల్యం నుంచే పుస్తక పఠనం అలవరచుకోవాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: విద్యార్థులు బాల్యం నుంచే పుస్తక పఠనం అలవరచు కోవాలని మండల విద్యాశాఖాధికారి టి రామ్మూర్తి తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాల యంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం గ్రందాలయాల విశిష్టత పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రామ్మూర్తి మాట్లాడుతూ గ్రందాలయాలు విజ్ఞాన భాండాగారాలు అన్నారు. విద్యార్థులు ప్రతి రోజు గ్రందాలయాలకు వెళ్ళి పుస్తక పఠనం అలవరచుకోవాలని ఆయన తెలిపారు. పుస్తక పఠనం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాలకులు ఆర్.కిషోర్, హెడ్ కానిస్టేబుల్ నారాయణ రావు, వ్యాయామ ఉపాధ్యాయుడు కె రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యాబుద్ధులు నేర్పించాలి

విశాలాంధ్ర- ఉండి : ప్రాథమిక దశ నుంచి బాల బాలికలకు విద్యాబుద్ధులు నేర్పించాలని అంగన్వాడి సూపర్వైజర్ బాల కుమారి వెల్లడించారు. మండల కేంద్రమైన ఉండి అంగన్వాడి కేంద్రంలో బాలల హక్కుల అవగాహన సదస్సు, బాలల దినోత్సవం, నెహ్రూ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బాలాకుమారి మూడు సంవత్సరాల నుండి ఐదు సంవత్సరాల లోపు పిల్లలను అంగన్వాడి కేంద్రాల్లో చేర్పించాలన్నారు. అంగన్వాడి కేంద్రాల్లో నేటి బాలలే రేపటి పౌరులుగా తీర్చిదిద్దబడతారన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ గడి కుసుమ, చైతన్య, విజయ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర

తొర్రిగడ్డ పంపింగ్ అభివృద్ధికి సహకరించాలి

ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

విశాలాంధ్ర - రాజానగరం,సీతానగరం : వ్యవసాయాన్ని సస్యశ్యామలం చేసేందుకు తొర్రిగడ్డ పంపింగ్ స్కీం అభివృద్ధికి సహకరించి రైతులకు అండగా నిలవాలని రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామ కృష్ణ అన్నారు. ఏపీ బడ్జెట్ సమావేశాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల రాజానగరం నియోజకవర్గం సాగునీటి అంశంపై శాసనసభాదిపతి చింతకాయల అయ్యన్నపాత్రుడును శనివారం కోరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ ప్రాంతంలో సుమారు 30 వేల ఎకరాలకు సాగునీరు అందించేందు కు తొర్రిగడ్డ రివర్స్ పంపింగ్ స్కీం ఎంతో కీలకపాత్ర పోషిస్తుందని చెప్పారు.గత ప్రభుత్వంలో తొర్రిగడ్డ రివర్స్ పంపింగ్ స్కీంకు సంబంధించి నిధులు కేటా యించినప్పటికీ ఒక రూపాయి కూడా ఖర్చు చేయలేదని ఆరోపించారు.దీంతో ఆ స్కీంకు కేటాయిం చిన నిధులు రద్దైపోయాయన్నారు. ఇదే అంశంపై బత్తుల తమదైన శైలిలో ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లారు.వరదల సమయంలో మిర్తిపాడు,బొబ్బిలంక, ములకలలంక ప్రాంత రైతులు,ప్రజలు అనేక ఇబ్బందు లు ఎదుర్కొంటున్నారని, ఆయా ప్రాం తాల్లో బ్రిడ్జిల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలనీ కోరారు. తొర్రిగడ్డ రివర్స్ పంపింగ్ స్కీంకు సంబంధించి నిధులను తిరిగి కేటాయించేలా ముఖ్య మంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ చొరవ తీసుకొని రాజానగరం అభివృద్ధికి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

బాల్ బ్యాడ్మింటన్ స్టేట్ టీమ్‌కు హేమంత్

విశాలాంధ్ర - అనపర్తి : ఎస్ జి ఎఫ్ అండర్ 17 బాల్ బ్యాడ్మింటన్ స్టేట్ టీమ్‌కు స్థానిక జిబిఆర్ జూనియర్ కళాశాల విద్యార్థి విసినిగిరి హేమంత్ దుర్గ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పిఆర్ఎల్ స్వామి తెలిపారు. శనివారం ప్రిన్సిపాల్ స్వామి మాట్లాడుతూ ఈనెల 9, 10 తేదీల్లో రాజమహేంద్రవరం ఎస్ కె వి టి డిగ్రీ కళాశాలలో జరిగిన 68వ ఎస్ జి ఎఫ్ ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో జిల్లా టీమ్ తరపున ఉత్తమ ప్రదర్శన కనబరిచి హేమంత్ దుర్గ బెస్ట్ ప్లేయర్ అవార్డు గెలుచుకున్నట్లు చెప్పారు. దీంతో పాటు స్టేట్ టీమ్‌కు హేమంత్ దుర్గ ఎంపికైనట్లు ప్రిన్సిపల్ చెప్పారు. ఈ సందర్భంగా హేమంత్‌ను జిబిఆర్ విద్యాసంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ తేతలి ఆదిరెడ్డి(కొండబాబు), డిగ్రీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్ పి అబ్బాయి రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్స్ ఎంవివి రామారెడ్డి, డేవిడ్ రాజు గొలుగూరి రామారెడ్డి అభినందించారు.

గ్రంథాలయాలను సద్వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - దేవరపల్లి : గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని గ్రంథాలయాలను విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని దేవరపల్లి గ్రంథాలయ ఇన్చార్జ్ అధికారి అనిత అన్నారు. శనివారం గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి అనిత, రిటైర్డ్ ఉపాధ్యాయులు పీవీకే రామారావు, స్థానిక బిహెచ్ ఎస్ ఆర్ అండ్ వివిఎమ్ డిగ్రీ పిజి కళాశాల అధ్యాపకులు వెంకటేష్, గంగరాజు, కిరణ్ కుమార్, మహీధర్ స్థానికులు ఏసురత్నం, బిహెచ్ఎస్ఆర్ అండ్ వివిఎం డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో ఎంఈఓ2 అప్పారావు ప్రసంగించారు

గ్రంథాలయోద్యమకారుల పాత్ర అమూల్యమైనది

విశాలాంధ్ర - కడియం : గ్రంథాలయోద్యమానికి విశేష కృషి చేసిన గ్రంథాలయోద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమయ్య, ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం పాత్ర అమూల్యమైనదని ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రాజు అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా కడియం గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారిణి శెట్టిపల్లి శ్రీదేవి నిర్మల అధ్యక్షతన జ్యోతి ప్రజ్వలన చేసి పుష్పం జలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. కడియం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రాజు మాట్లాడుతూ ఆనాడు సొంత ఆస్తులను, సమయాన్ని, జీవితాలను త్యాగం చేసి గ్రంథాలయాలను స్థాపించడంలో, గ్రంథాలయాలను ప్రోత్సహించడంలో వారు చేసిన కృషి అద్వితీయమని అన్నారు. ఆనాటి గ్రంథాలయ ఉద్యమానికి విశేష కృషి చేసిన వారి ముగ్గురి చిత్ర పటాలు, వారి జీవిత చరిత్రలు ప్రతి పాఠశాల, కళాశాలలో ఉండేలా చర్యలు చేపట్టాలని అన్నారు. విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, కవి ప్రసాద్, విశేశ్వర్ న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు.

సమాజంలో పాత్రికేయుల పాత్ర కీలకం

విశాలాంధ్ర - దేవరపల్లి : ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారిధి లాగా పని చేస్తూ ప్రజలకు చైతన్య పరుస్తున్న పాత్రికేయులు పాత్ర ఎంతో కీలకమైనదని తూర్పుగోదావరి జిల్లా కమ్యూనిటీ పారా మెడిసి ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు బల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. దేవరపల్లిలో శనివారం జాతీయ పత్రిక దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ పాత్రికేయ వృత్తి ఎంతో పవిత్రమైనదని ఈ వృత్తిలో ప్రతి వ్యక్తికి ఎన్నో ఇబ్బందులు గురవుతున్న వృత్తి ధర్మాన్ని పాటిస్తూ అనేక సేవలను పాత్రికేయులు అందిస్తున్నారు దీనిలో భాగంగా దేవరపల్లి మండలంలోని పాత్రికేయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి దేవానంద్, నూతనంగా ఎన్నికైన దేవరపల్లి మండల పిఎంపి అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల నాగేశ్వరరావు, దాసరి సత్య భాస్కరరావు చింతలపాటి ప్రసాద్, మామిడిపల్లి వెంకట్రావు, మండలకు బాలసుబ్రమణ్యం, చాపల కామరాజు, పి ఎం పి అసోసియేషన్ కమిటీ సభ్యులు గంగ , హాస్పటల్ వైద్యులు పరామాంశ స్పందన, రుక్మాంగద రావు తదితరులు దేవరపల్లి మండలం పాత్రికేయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాత్రికేయులు మండల అధ్యక్షుడు చిన్న వెంకటేశ్వర్లు సీనియర్ పాత్రికేయులు కాసాని వెంకటేశ్వరరావు తోట సత్యనారాయణ గేలం వెంకటేశ్వరరావు పల్లికొండ వినోద్ కుమార్ ఎస్ కే భాష టీవీఎస్ ఎన్ రెడ్డిలను ఘనంగా సత్కరించారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతలో రాజీవద్దు

విశాలాంధ్ర - సీతానగరం : మండలంలో సీతానగరం గ్రామంలోని పువ్వాడ సత్యమాంబ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో శనివారం మధ్యాహ్న భోజన సమయంలో మహిళా సాధికారత కమిటీ అధ్యక్షురాలు సూర్యవతి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు వెళ్లి మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలో డొక్కా సీతమ్మ పేరు మీద విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతలో కానీ రుచిలో కానీ రాజీ పడవద్దు అని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిటీసభ్యులు, వీర మహిళలు పాల్గొన్నారు

అసభ్యకర కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : సుప్రీం కోర్టు వారి ఆదేశానుసారం తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయస్థాన ఆవరణలోనీ డిఎల్ఎస్ఎ కార్యాలయంలో "పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల నిషే ధ చట్టం, 2013" పై న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జ్ పద్మ మాట్లాడుతూ మహిళలపై లైంగిక వేధింపుల నిషేధ చట్టం, 2013" లోని వివిధ అంశాలను గురించి వివరించారు. లైంగిక వేధింపులు, అసభ్యకర కార్య కలాపాలకు పాల్పడితే చట్ట పరమైన చర్యలు తప్పవని అన్నారు. ప్రతీ కార్యాలయంలో ఈ విష యాల పై చర్యలు తీసుకునేందుకు ఆ సంస్థకు సంబంధించిన అధికారులు, ఉద్యోగులు, తదిత రులతో కూడిన "అంతర్గత ఫిర్యాదుల కమిటీ" ఉంటుందని తెలిపారు. మహిళలకు ఎలాంటి లైంగిక వేధింపులు ఎదురైనా ఈ కమిటీ దృష్టికి తీసుకు రావాలని, విచారణ జరిపిన తగు రీతిలో కమిటీ చర్యలు తీసుకుంటుందని వివరించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. ప్రకాష్ బాబు మాట్లాడుతూ సహ ఉద్యోగులతో సోదరభావంతో మెలగాలని, వారికి ఇబ్బందికర పరిస్థితులకు గురిచేయరాదని అన్నారు. ఈ సదస్సులో అసిస్టెంట్ కలెక్టర్ భావనా హెచ్ఎస్ , ఐసిడిఎస్‌పిడి. కె.విజయ్ కుమారి , రెవెన్యూ సిబ్బంది, సిడిపిఓ నర్సమ్మ , వార్డ్ సచివాలయం కార్యదర్శిలు పాల్గొన్నారు.

కోఆర్డినేటర్‌గా ఉల్లాహ్ బేగ్

విశాలాంధ్ర - కొవ్వూరు : కాంగ్రెస్ పార్టీ కొవ్వూరు నియోజకవర్గం కోఆర్డినేటర్‌గా కాపవరం గ్రామానికి చెందిన మహమ్మద్ పాసి ఉల్లాహ్ బేగ్‌ను నియమించినట్లు కాంగ్రెస్ పార్టీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు టీ కే విశ్వేశ్వర రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పాసి ఉల్లా బేగ్ మాట్లాడుతూ కొవ్వూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని అంచలంచలుగా ముందుకు నడుపుతానని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. నాపై నమ్మకం ఉంచి ఈ పదవులు ఇచ్చిన షర్మిలరెడ్డికి , టీకే విశ్వేశ్వర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

విశాలాంధ్ర - కడియం : మండలంలోని కడియపు లంకకు చెందిన పల్ల వెంకన్న చారి టబుల్ ట్రస్ట్ ఏవిఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉపయోగార్థం రూ. 8 వేలు విలువచేసే కుట్టు మిషన్, ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహానికి రూ. 10 వేల ఖరీదైన గ్రైండర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ అధ్యక్షత వహించారు. పల్ల వెంకన్న కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన ట్రస్టు ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. పల్ల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పరీక్ష ఫలితాల్లో దూసుకుపోతున్నాయని, ట్రస్ట్ సభ్యులు పల్ల వెంకటేష్ మాట్లాడుతూ అత్యధిక సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తామని తెలియజేశారు. కడియం వసతి గృహం వార్డెన్ ఏవివి వెంకటలక్ష్మి మాట్లాడుతూ ట్రస్ట్ అధ్యక్షులు పల్ల వీర వెంకట సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం, గణపతులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

సిసి రోడ్ల నిర్మాణ పనులు పరిశీలన

విశాలాంధ్ర - ఆలమూరు : మండలంలోని గుమ్మిలేరు గ్రామ సచివాలయానికి సమీపంలోని సిసి రోడ్డు నిర్మాణం పనులను స్థానిక టిడిపి సీనియర్ నేత ఈదల వీర్రాజు చౌదరి ఆధ్వర్యంలో శనివారం ఎంపీడీవో రాజు పరిశీలించారు. గత నెలలో స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు శంకుస్థాపన చేసిన ఈ రహదారికి ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.15 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఈ నిధులతో సుమారు 215 మీటర్ల పొడవు గల సిసి రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఇవి పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ వ్యవస్థ ఆధ్వర్యంలో నిర్మాణం పనులను పరిశీలించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ

ఇద్దరు అరెస్టు

విశాలాంధ్ర - గోపాలపురం : ఇద్దరు మహిళలను రాడ్లతో బెదిరించి కొట్టి గాయపరిచి ఆ ఇంటిలో 40 కాసుల బంగారం, వెండి వస్తువులను, రూ. 3,50,000 నగదును దోచకుని పారిపోయిన సంఘటనలో ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు. సీఐ నాగేశ్వర్ నాయక్, ఎస్ఐకే సతీష్ కుమార్ తెలిపారు. వివరాల ప్రకారం ఈనెల రెండవ తేదీ రాత్రి మండలంలోని సాగిపాడు గ్రామంలో బమ్మిడి పాటి శారద(40) గరిమెళ్ళ సూర్యకాంతం(80) లను ఇద్దరు వ్యక్తులు మాస్క్ టోపీ ముసుగులు ధరించి ఇనుప రాడ్లతో ఇంట్లోకి చొరబడి విచక్షణ హితంగా గాయపరిచి మూడున్నర లక్షల సొమ్మును, 40 కాసుల బంగారాన్ని, వెండి వస్తువులను దోచుకుని వెళ్లారని అన్నారు. ఈ నేరానికి పాల్పడిన ఏ 1, చీకట్ల సతీష్ అలియాస్ పండు నిన్న జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్‌లో వేరొక కేసులో అరెస్టు చేసి జైలుకు పంపారని, ఏ2 షేక్ అబ్దుల్ బాదుల్లా షరీఫ్ అనే ముద్దాయి రాజమహేంద్రవరం బొమ్మూరు గ్రామానికి చెందిన వాడిని ప్రస్తుతం ఇతడు జంగారెడ్డిగూడెంలో నివాసం ఉంటున్నాడని ఏ 3 నక్క కిషోర్ బాబు గోపాలపురం మండలం తొక్కిరెడ్డి గ్రామానికి చెందిన వాడిగా గుర్తించి ఈ ఏ2, ఏ3 లను దేవరపల్లి సిఐ బి. నాగేశ్వర నాయక్ , గోపాలపురం ఎస్సై కే సతీష్ కుమార్ టీమ్ తన సిబ్బందితో గుడ్డి గూడెం వెళ్లే రోడ్డులోని కనకదుర్గమ్మ గుడి వద్ద అరెస్టు చేశామని తెలిపారు. వీరి వద్దనుండి 40 కాసుల బంగారం 270000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నాగేశ్వర్ నాయక్ తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : మండలంలోని తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలోని కపిలేశ్వరపురం శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవముల సందర్భంగా శనివారం పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను జూనియర్స్ విభాగంలో గ్రంథాలయాలు వాటి ఉపయోగాలు, సీనియర్స్ విభాగంలో పుస్తక పఠనం ఆవశ్యకత గురించి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యమకారులు గ్రంథాలయ పితామహ అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం, గాడిచర్ల హరిసర్వోత్తమరావు వంటి ఉద్యమకారులను స్మరించుకొన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి డి శివకుమారి మాట్లాడుతూ ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు 20వ తేదీన గ్రంథాలయ వారోత్సవముల ముగింపు సభ సందర్భంగా బహుమతులు అందజేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీలు

విశాలాంధ్ర - జగ్గంపేట : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని జగ్గంపేట శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు శనివారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అక్షర జ్యోతి కళాశాల ఉపాధ్యాయులు కుమారి సాయి భువనేశ్వరి, విశ్రాంతి ఉపాధ్యాయులు చంద్రమౌళి వెంకట శాస్త్రి, లైబ్రేరియన్ ఉదయ భాస్కరరావు పాల్గొని పోటీలను పర్యవేక్షించారు.

యూనిక్ నెంబర్‌తో విద్యార్థులకు ప్రయోజనం

విశాలాంధ్ర - పెదపూడి : ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంటు రిజిస్ట్రీ (అపార్) పేరుతో విద్యార్థులకు ఆధార్ తరహాలో ప్రత్యేక నెంబర్‌తో కూడిన గుర్తింపు కార్డు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. యూనిక్ నెంబర్‌తో విద్యార్థులకు కలిగే ప్రయోజనాలు, సమస్యలు అధిగమించడానికి ఎంపీడీవో కొవ్వూరి నరేంద్ర రెడ్డి, ఈఓఆర్డి ఎంఎస్ఎన్ రెడ్డి, ఎంఈఓ-1,2కె సత్యనారాయణ, సత్యనారాయణ గొల్లల మామిడాడ, పెదపూడి హైస్కూల్ ఉపాధ్యాయులకు పెదపూడి గాంధీ స్కూల్లో శనివారం సమావేశం నిర్వహించారు. ఆధార్, స్కూల్లో నమోదైన పేర్లు, పుట్టిన రోజు తేదీలు ఒకే విధంగా ఉంటేనే యూనిక్ నెంబర్ జనరేట్ అవుతుందని, విద్యార్థులతో అపార్ పూర్తిచేయాలని ఆదేశించారు.

మహిళలు, బాలికల రక్షణే ధ్యేయం : సీఐ

విశాలాంధ్ర - జగ్గంపేట : మహిళలు, బాలికల రక్షణే ధ్యేయంగా పోలీసు వ్యవస్థ పనిచేస్తుందని జగ్గంపేట సిఐ వైఆర్‌కె శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని గొల్లలగుంట జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బుల్లబ్బాయి, మహిళా పోలీసులు శ్యామలత, , నాగలక్ష్మి ఆధ్వర్యంలో పోలీస్ సేవలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిఐ వైఆర్‌కే హాజరై మాట్లాడుతూ తోటి విద్యార్థుల పట్ల ర్యాగింగ్‌కు పాల్పడడం చట్ట వ్యతిరేకమన్నారు. డయల్ 112, 102, 9494933233 వాట్సాప్ నెంబర్ల విస్తృత ప్రచారం, వినియోగం ద్వారా పోలీసు సేవలను వివరించారు. మహిళలు నేరాలు బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పొందే పోలీస్ సేవల గురించి అవగాహన కల్పించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ర్యాగింగ్, ఫోక్సో చట్టాలు గురించి వివరించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం : సీఐ

విశాలాంధ్ర - అనపర్తి : ప్రస్తుతం సమాజంలో సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని వీటి పట్ల అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్త వహించాలని సిఐ సుమంత్ సూచించారు. శనివారం స్థానిక వర్తక సంఘం కళ్యాణ మండపంలో అనపర్తి, రంగంపేట, బిక్కవోలు మండల బ్యాంకు అధికారులు, సిబ్బందితో సిఐ సుమంత్, ఎస్ ఐ శ్రీను నాయక్ సైబర్ క్రైమ్ అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ అధికారుల నుండి సైబర్ నేరాలు, మోసాలు పట్ల కొంత అవసరమైన సమాచారం సేకరించి సిఐ సుమంత్, ఎస్ఐ శ్రీనునాయక్ బ్యాంకు అధికారులకు కొన్ని సూచనలు చేశారు.

కొత్త రైల్వేలైన్ సర్వే ఆపాలి

కలెక్టర్‌కు రైతుల వినతి

విశాలాంధ్ర - మామిడికుదురు : కోటిపల్లి - నరసాపురం రైల్వే లైన్ నిర్మాణ పనుల్లో భాగంగా కొత్తగా చేపట్టిన సర్వే నిలుపుదల చేయాలని మామిడికుదురు మండలం పరిధిలోని నగరం, పెదపట్నం, మొగలికుదురు, గెద్దాడ, పాసర్లపూడి, రాజోలు మండలం పరిధిలోని పాలగుమ్మి గ్రామాల రైతులు శనివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్‌కి వినతిపత్రాన్ని అందజేశారు. 2002 సంవత్సరంలో రైల్వే లైన్ నిర్మాణం కోసం చేపట్టిన సర్వే అందరికీ ఆమోదయోగ్యమైనదే అని, కొత్తగా చేపట్టిన సర్వే వల్ల సార వంతమైన భూములు, నివాసాలు కోల్పోతున్నాం అని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త సర్వే ప్రకారం ఒక్క నగరం గ్రామంలోనే ఏడు ప్రధాన రహదారులను క్రాస్ చేస్తూ రైల్వే లైన్ నిర్మాణం వెళ్లడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. 2002 సంవత్సరం నాటి పాత సర్వే పక్కనపెట్టి కొత్త సర్వే పేరుతో కుట్ర జరుగుతుందని రైల్వే బాధితులు ఆరోపిస్తున్నారు. కేవలం చమురు సంస్థల కంపెనీలు వారి సౌకర్యం కోసం కొత్త సర్వే చేయిస్తున్నారనీ ప్రజల్లో అపోహలు నెలకొన్నాయని వాటికి వివరణ ఇవ్వాల్సిన బాధ్యత ప్రజాప్రతి నిధులు, అధికార యంత్రాంగంపై ఉందన్నారు. తక్షణమే అధికారులు స్పందించి కొత్త సర్వే నిలుపుదల చేయాలని, లలేనియెడల ప్రజలంతా ఉద్యమబాట పట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాలెం సుబ్బారావు, దొంగ సత్యనారాయణ, అప్పారి వెంకట సత్య నారాయణమూర్తి, కోళ్ల సురేష్ బాబు, చిట్టూరి వీరాస్వామి, కడలి బాబూరావు, బంపన శ్రీను, చిట్టూరి యేసు వెంకట సత్యనారాయణ, లక్కింశెట్టి సురేష్, కాసిన గిరిబాబు, బూసీమ శ్రీను, యండ్ర పుల్లయ్య, యాండ్ర నాని, రామకృష్ణ, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

గ్లోబల్ రంగాల్లో భవిష్యత్‌ను అన్వేషించాలి

ఆదిత్య ఫార్మసీ కేర్-2024 జ్ఞానం, ఆవిష్కరణలు, సాంస్కృతిక మార్పిడుల సమ్మేళనం

విశాలాంధ్ర - గండేపల్లి : ఆదిత్య గ్రూప్ ఆఫ్ ఫార్మసీ కాలేజ్ సూరంపాలెం, నవంబర్ 16, 2024- ఆదిత్య యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆదిత్య గ్రూప్ ఆఫ్ ఫార్మసీ కాలేజ్‌లో జరిగిన కంప్యూటేషనల్ అడ్వాన్స్‌మెంట్స్ ఇన్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ ఫర్ ఫార్మస్యూటికల్ ఎక్సలెన్స్ జాతీయ సదస్సు విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమం అందులో పాల్గొన్న వారిని ప్రేరేపిస్తూ ఆవిష్కరణలకు మార్గనిర్దేశం చేసింది. డాక్టర్ చాగంటి శ్రీధర, ప్రిన్సిపల్ సైంటిస్ట్ అనలిస్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాదు, ఆనలిటికల్ ల్యాబ్‌లలో నిబంధనల అంశాలు గురించి చర్చిస్తూ, ఫార్మస్యూటికల్ పరిశోధనల్లో నాణ్యతా ప్రమాణాల ప్రాధాన్యత వివరించారు. మిస్టర్ కె శ్యామ్ సుందర్, టెక్నికల్ ట్రైనింగ్ అండ్ ఎడ్యుకేషన్ హెడ్-సౌత్ ఆసియా, ఖ్యాతీఖీ, హైదరాబాదు, ఫార్మా గ్రాడ్యుయేట్లకు అందుబాటులో ఉన్న విభిన్న అవకాశాలు గురించి మాట్లాడుతూ, విద్యార్థులు గ్లోబల్ రంగాల్లో తమ భవిష్యత్‌ను అన్వేషించమని ప్రేరేపించారు. ఈ కార్యక్రమానికి ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎం శ్రీనివాస రెడ్డి, హాజరై, సదస్సు విజయవంతం కోసం కృషి చేసిన నిర్వాహకులు, పాల్గొన్న వారిని ప్రశంసించారు. ఈ రెండు రోజుల సదస్సులో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి సర్టిఫికేట్లు, బహుమతులు అందజేశారు. డాక్టర్ కె రవి శంకర్, ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్, డాక్టర్ డి సతీష్ కుమార్, ఆదిత్య ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్, సదస్సును విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి,విద్యార్థులు, మరియు ఆదిత్య సంస్థల సిబ్బందికి, ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ రెండు రోజుల కార్యక్రమం దేశవ్యాప్తంగా ప్రఖ్యాత విద్యావేత్తలు, పరిశోధకులు, విద్యార్థులను ఏకతాటిపైకి తీసుకువచ్చింది. ఫార్మస్యూటికల్ పరిశోధన మరియు విద్యను అభివృద్ధి చేయడానికి కంప్యూటేషనల్ సాధనాలు మరియు వ్యూహాలపై చర్చలు జరిగాయి. కేర్ 2024 జ్ఞానం పంచుకునే వేదికగా నిలిచింది.

ఆదిత్యలో ముగిసిన శ్రీ సహస్ర చండీయాగం

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య విద్యా ప్రాంగణంలో ఈ నెల 12వ తేదీ ఉనుండి జరుగుతున్న శ్రీ సహస్ర చండీ యాగం 200లకు పైగా ఋత్వికుల వేదోక్త మంత్రాల నడుమ దిగ్విజయంగా ముగిసింది. ఆదిత్య యాజమాన్యం డా నల్లమిల్లి శేషారెడ్డి, లక్ష్మీ రాజ్యం దంపతులు, డా సతీష్ రెడ్డి శృతి రెడ్డి దంపతులు, కృష్ణ దీపక్ రెడ్డి, సుగుణ రెడ్డి దంపతులు, చైతన్య గ్రూప్ అధినేతలు చింతా వెంకట రెడ్డి (బాబులు రెడ్డి)దంపతులు, జిల్లా అటవీ శాఖ అధికారి రవీంద్ర దంపతులు, ఆదిత్య యాజమాన్య కుటుంబ సభ్యులతో పాటు మిత్రులు, ఆదిత్య సిబ్బంది పాల్గొన్నారు. చివరి రోజు యాగం అనంతరం పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. ఆదిత్య అధినేత డా నల్లమిల్లి శేషారెడ్డి మీడియాతో మాట్లాడుతూ విద్యార్థిలో విశ్వాసం పెంపొందించడానికి ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని చేరుకోవడానికి ఆత్మవిశ్వాసం ఎంతో అవసరమని, ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ డా సతీష్ రెడ్డి విద్యార్థుల అభివృద్ధి కోసం, సమస్త మానవాళి శ్రేయస్సు కోసం ఈ శ్రీ సహస్ర చండీ యాగం చేశారని, ఈ కార్యక్రమంలో ఆదిత్య కుటుంబ సభ్యులు, సిబ్బంది, బంధుమిత్రులు పాల్గొన్నారు.

రామ్మూర్తి నాయుడు మృతి పార్టీకి తీరని లోటు : మంత్రి సుభాష్

విశాలాంధ్ర - రామ చంద్రపురం : ముఖ్య మంత్రి చంద్రబాబు నా యుడు సోదరుడు, మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు మరణంపై రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఆయన మృతి తెలుగు దేశం పార్టీకి, చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు తీరని లోటుగా పేర్కొన్నారు. నారా రామ్మూర్తి నాయుడు 1994 నుంచి 1999 వరకు చంద్రగిరి శాసనసభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తూ విశేష సేవలు అందించారని మంత్రి సుభాష్ గుర్తు చేశారు. నారా రామ్మూర్తి నాయుడు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రామ్మూర్తి నాయుడి సేవలను తెలుగు ప్రజలు ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటారని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

దాట్ల సుబ్బరాజుకు అభినందనల వెల్లువ

విశాలాంధ్ర - తాళ్లరేవు : ముమ్మిడివరం నియోజకవర్గం కూటమి శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు ఇటీవలే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శాసనసభలో తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులకి సంబంధించి దాట్ల సుబ్బరాజును విప్‌గా నియమించారు. తాళ్లరేవు మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కూటమి నాయకులు ఆధ్వర్యంలో సుబ్బరాజును ఘనంగా సత్కరించారు, ఈ కార్యక్రమంలో టేకుమూడి లక్ష్మణరావు, వాడ్రేవు వీరబాబు, మందాల గంగ సూర్యనారాయణ, కట్టా త్రిమూర్తులు, అత్తిలి బాబూరావు, దత్తాత్రేయ, పెసంగి ఈశ్వర రావు, భాస్కరరాజు, యం వెంకటేశ్వర రావు, టేకుమూడి వివి సత్యనారాయణ, వెంటపల్లి ఉమామహేశ్వరి, కృష్ణ కుమారి, ఆదినారాయణ చౌదరి, వుంగరాల వెంకటేశ్వరరావు, నిమ్మకాయల మూర్తి, చక్రవర్తి, చిరంజీవి, వైదాడి శ్రీను, భజన సత్తిబాబు, గంజా సూరిబాబు, సూరంపూడి కుమార్, దుర్గాప్రసాద్, విజయ్, గోపాలకృష్ణ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. సుబ్బరాజు మాట్లాడుతూ నాకు దక్కిన గౌరవం కేవలం మీ అందరి ఆదరాభిమానాలకే నని, అదేవిధంగా ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా ఓఎన్జీసి ఇచ్చే డబ్బులు ఎన్నికల కోడ్ కారణంగా డిసెంబర్ 8 తరువాత ఇస్తారని, రైతులు ఎదుర్కొంటున్న ఇంజరం వంతెన నిర్మాణం నిమిత్తం రూ.3కోట్ల అనుమతి ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకి రైతుల తరుపున కృతజ్ఞతలు తెలిపారు.

మా భూమి మాకు అప్పచెప్పండి

అడంగళ్‌లో పేరు నమోదు చేయండి

విశాలాంధ్ర - తాళ్లరేవు : మండలంలోని పి మల్లవరం పంచాయతీకి చెందిన "డి పట్టా" లబ్ధిదారులు శనివారం తాళ్లరేవు మండల తాహశీల్దార్ పితాని త్రినాథరావుకి వినతి పత్రం అందజేశారు, 2008వ సంవత్సరంలో అప్పటి శాసన సభ్యులు దొమ్మేటి వెంకటేశ్వర్లు ఆదేశానుసారం సర్వే నెంబర్ 622/8లో పి మల్లవరం పంచాయతీ పరిధిలోని దడాల అనంతలక్ష్మి, దున్నా సుబ్బలక్ష్మి, దొమ్మేటి గంగాదేవి, ధూళిపూడి సీతారాం, పితాని సత్యవతి తదితరులుకి 30 సెంట్లు చొప్పున భూమి తాలుకా పట్టా మరియు పాస్ పుస్తకాలు అందజేశారు. నాటి నుంచి నేటి వరకు అనేక సార్లు అధికారులు చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. శనివారం మరలా అందజేసిన వినతిపత్రంలో భూమి తాలూకు వివరాలు ఆన్లైన్ , అడంగళ్‌లో చేర్పించాలని, ఆక్రమణ దారులు నుంచి భూమిని తీసుకుని మాకు అందజేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వెంకటరమణ (బాబి), పితాని విష్ణు పాల్గొన్నారు.

మితిమీరుతున్న కూటమి ప్రభుత్వ అరాచకాలు

మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి

విశాలాంధ్ర - పెదపూడి : కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలవుతున్నా అధికార పార్టీ అరాచకాలు కొనసాగుతూనే ఉన్నాయని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి విమర్శించారు. శనివారం మాజీ ఎమ్మెల్యే సత్తి పెదపూడి మండలం రాజు పాలెంలో సుమారు 40 ఏళ్లుగా ఉంటున్న కర్రి చంద్రబాబు, గంజా సూర్య నారాయణ, నల్ల వీర వెంకటరమణకు చెందిన కూల్చివేసిన దూడపాకలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు దగ్గరుండి దూడపాకలను కూల్చివేయడం పట్ల ఆక్షేపణ వ్యక్తం చేశారు. ఆక్రమణలు తొల గించాలనుకుంటే మొత్తం అన్నింటిని తొలగించాలని వైసిపి సానుభూతి పరులవే తొలగించడం భయభ్రాంతులకు గురి చేసేందుకే అని ఆరోపించారు. పంచాయతీ పన్ను, రెవెన్యూ పట్టా ఉన్నప్పటికీ కనీసం నోటీసు కూడా ఇవ్వ కుండా తొలగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ విధమైన దౌర్జన్యాలు కొనసాగిస్తే అధికార పార్టీ భవిష్యత్తులో ప్రజల ఆగ్రహాన్ని, తిరుగు బాటును ఎదుర్కోక తప్పదని మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో వేంద్ర, సర్పంచులు కోసూరి వాసు, సుందరపల్లి ప్రమీల వీరభద్రం, మాజీ సర్పంచ్లు నాగుమళ్ళ వీరభద్రరావు, కట్టా రమణ, పార్టీ మండల కన్వీనర్ రమణ, ఎంపీటీసీ బొక్కా దుర్గా శ్రీనివాస్ ఉన్నారు.

బాల కార్మికులను బడికి పంపించాలి

విశాలాంధ్ర - కరప : బడి ఈడు పిల్లలను బడికి పంపిం చాలని తల్లిదండ్రులకు అసిస్టెంట్ లేబర్ ఆఫీ సర్ పద్మావతి పేర్కొ న్నారు. కరప మండలం లోని చిన్న కొత్తూరు, పెద్దకొత్తూరు, కొరుపల్లే, ఎండ మూరు గ్రామాలలో ఆమె పర్యటించి ఇటుక పరిశ్రమలు, భవన నిర్మాణ ప్రదేశాలు, కిరాణా షాపులు వద్ద తనిఖీలు నిర్వ హించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ బడి మానివేసి బాల కార్మి కులుగా పనికి తీసుకువెళుతున్న, పనిలో పెట్టుకున్న వారిపై తక్షణమే కేసులు నమోదు చేస్తామని పద్మావతి తెలిపారు. తల్లితండ్రులు తమ పిల్లలను తప్పని సరిగా బడికి పంపించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2 పి సత్యనారాయణ పాల్గొన్నారు.

భూ రీ సర్వే సదస్సులో 101 ఆర్జీలు

విశాలాంధ్ర - కరప : కరప మండలం గొరుపూడి గ్రామంలో భూ సంబంధిత రి సర్వే సదస్సులు నిర్వహించగా రైతులు సదస్సులో పాల్గొని తమ సమస్యలను తెలియజేశారని తాసిల్దార్ ఎన్ సత్యనారాయణ తెలిపారు. ఈ సదస్సులో 101 ఆర్జీలు అందాయని వీటిపై తక్షణమే చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్, మండల సర్వేయర్, గ్రామ రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా కేన్సర్ స్కానింగ్ సర్వే

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : మండలంలో ఇంటింటా కేన్సర్ స్క్రీనిం గ్ సర్వే, అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధి కారుల ఆదేశాల మేరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రము అంగర వైద్యాధికారి డాక్టర్ పిఎంఎస్ డి రత్నకుమారి వారి ఆధ్వర్యంలో పీహెచ్సీ పరిధిలో ఆరు సచివాలయాలలో క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా ప్రతి ఇంటిని దర్శించి 18 సంవత్సరముల వయసు పైబడిన వారినందరిని ఇంటి వద్దనే కేన్సర్ కోసం స్క్రీనింగ్ చేసి అనుమానితులను ప్రభుత్వ ఆసుపత్రికి పంపించి, చికిత్స అంద జేస్తామని, ప్రతి ఒక్కరూ సహకరించాలని డాక్టర్ రత్నకుమారి అన్నారు. ఈ కార్యక్రమములో ఎంపిహెచ్ఈఓ జె మల్లికార్జునుడు, హెల్త్ ఎడ్యుకేటర్ రామా రావు, ఎంఎల్ హెచ్పిలు, ఆరోగ్యశ్రీ కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఇటుక బట్టీల నిర్వహణ

- ఇటుక బట్టి యజమానుల ధన దాహానికి మరో కార్మికుడు బలి
- రోడ్డుకు ఆనుకుని ఉన్న అధికారుల చర్యలు శూన్యం
- పనిచేస్తున్న కార్మికులకు రక్షణ కల్పించని యజమానులు

విశాలాంధ్ర - రౌతులపూడి : రౌతులపూడి మండలంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఇటుక బట్టీలు బంధనలకు నీళ్లు వదిలి అధికారుల అండ దండలతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. పని చేస్తున్న కార్మికులకు కనీస రక్షణ సౌకర్యాలు కూడా కల్పించకుండా వారి ప్రాణాలు పోవడానికి కార కులు అవుతున్నారు. ఫలితంగా రౌతులపూడి మం డలం బంగారయ్యపేట గ్రామంలో శనివారం జరి గిన ప్రమాదంలో ఒక కార్మికుడు ప్రాణాలు కోల్పో యాడు. ఆధారం కోల్పోయి దిక్కు తోచని స్థితిలో విలపిస్తోంది. మండలంలోని బంగారయ్య పేట గ్రామానికి చెందిన పచ్చిరెడ్డి శీనుబాబు (38), తండ్రి కోటేశ్వరరావు, కార్మికుడు విరవాడకి చెందిన దిబిడి కృష్ణార్జున్ యొక్క ఇటుకు బట్టీలో పనులు నిమిత్తం వెళ్లి మహేంద్ర 7256 నెంబర్ గల ట్రాక్టర్ మీద ఇటుకలు తయారు చేసే మట్టిని తొక్కు చుండగా, ట్రాక్టర్ అదుపుతప్పి ప్రమాదవ శాత్తు వెనక్కి తిరగబడిపోగా, డ్రైవర్ శీను బాబు ట్రాక్టర్ కింద ఉండి మట్టిలో కురుకుపోవడం వలన అక్కడికక్కడే చనిపోయాడని పోలీసులు తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. శ్రీను బాబు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రౌతులపూడి పోలీసులు తెలిపారు. దానిపై రౌతులపూడి ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాణిజ్య బ్యాంకులకు సమాంతరంగా సహకార వ్యవస్థ

డివిజనల్ కో ఆపరేటివ్ ఆఫీసర్ రాధాకృష్ణ

విశాలాంధ్ర - ఆలమూరు : వాణిజ్య బ్యాంకులు అందించే అన్ని రకాల సేవలతో సమాంతరంగా సహకార వ్యవస్థ పని చేయాలని డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్ రాధాకృష్ణ సూచించారు. సహకార సంఘ వారోత్సవాలలో భాగంగా ఆలమూరు సహకార సంఘం వద్ద సహకార జెండా ఆవిష్కరించి అనంతరం సహకార ఉద్యోగులతో శనివారం సమీక్ష నిర్వహించారు. బ్యాంకులు అందించే సేవలతో పాటు మీ సేవ కేంద్రాల ద్వారా అందించే సేవలను కూడా రైతులకు అందుబాటులోనికి సహకార సంఘాలు తీసుకురావాలని ఏ.రాధాకృష్ణ కోరారు. సహకార వ్యవస్థను పటిష్టం చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించిందని దీనిలో భాగంగా సహకార వ్యవస్థ పటిష్టం కోసం అనేక ప్రోత్సాహకాలను అందిస్తుందని ఆయన చెప్పారు. సహకార సంఘాల ద్వారా రైతులకు రుణాలు మంజూరు చేసే సమయంలో వారు తీసుకొచ్చిన పత్రాల ఆధారంగా రుణాలు మంజూరు చేయకుండా ఆస్తులను భౌతికంగా పరిశీలించి రుణాలు మంజూరు చేయడం సరైన విధానం అని సహకార ఉద్యోగులకు ఆయన సూచించారు. ఈ సమావేశంలో కోఆపరేటివ్ సహకార వ్యవస్థ అధ్యాపకులు రామదాసు, సహకార వారోత్సవ జిల్లా ఇంచార్జి ఆదిమూలం వెంకటేశ్వరరావు, ఆలమూరు పిఎసిఎస్ పర్సనల్ ఇంచార్జ్ డి రాంబాబు, ఆలమూరు మండపేట కపిలేశ్వరపురం డిసిసిబి బ్యాంకు మేనేజర్లు సూపర్వైజర్లు, సహకార సంఘం సీఈఓలు సిబ్బంది పాల్గొన్నారు.

కనువిందు చేస్తున్న చెరువు అందాలు

విశాలాంధ్ర - లింగపాలెం : మండల కేంద్రమైన లింగపాలెంలో ఈ గ్రామం నుంచి కొత్తపల్లి వెళ్లే మార్గంలోని ప్రధాన రహదారి ప్రక్కనే ఉన్న పేరంటాల చెరువు అందాలను తలపిస్తుంది. చెరువు పైభాగంలో నీట పై నాను జాతికి చెందిన మొక్క పచ్చ తివాసి పరిచినట్లుగా చెరువంత విస్తరించి ఉంది. నీళ్లపై పచ్చని తివాసి పరిచినట్లుగా చెరువు పైభాగం కనువిందు చేస్తుంది. పై భాగంలో మేఘాలు అందంగా కనిపిస్తూ ముచ్చట గొలుపుతున్నాయి. ఒక్కసారిగా ఈ అందాన్ని చూసిన వారంతా ఇది లింగ పాలెమేనా! అన్నట్లుగా ఆశ్చర్య చకితులై పరవశిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ఈ చెరువు దృశ్యం సినిమా షూటింగులకు ఉపయోగపడేలా ఉందని పలువురు అంటున్నారు.

ఘనంగా శ్రీసాయి వీరభద్ర స్వామి 12వ వార్షికోత్సవం వేడుకలు

విశాలాంధ్ర - మామిడి కుదురు : అప్పనపల్లి గ్రామం లో కొలువై ఉన్న శ్రీ సాయి వీరభద్ర స్వామి ఆలయం 12వ వార్షికోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆల య అర్చకులు శ్రీనివాస్ ఆధ్వ ర్యంలో తులా గోపాలకృష్ణ, నాగ సూర్యావతి, యేడిద వెంకట నారా యణ, విజయ కనకదుర్గా, కంకిపాటి హేమంత్ నాగేం ద్ర, రాజేశ్వరీ దంపతులు కర్తలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాయి వీరభద్ర స్వామి వారికి గణపతి పూజ, పంచామృతాలతో అభిషేకాలు చేశారు.

రోబోటిక్ అప్లికేషన్‌ల కోసం కస్టమ్ ఎంబెడెడ్ బోర్డు అభివృద్ధి

విశాలాంధ్ర - కాకినాడ : జెఎన్‌టియుకె ప్రాంగణంలో ఇండస్ట్రీ ఇనిస్టిట్యూట్ ఇంటరాక్షన్ ప్లేస్‌మెంట్అండ్ ట్రైనింగ్ (ఐఐఐపి,టి) డైరెక్టరేట్ కోయంబత్తూర్‌లోని జీకర్స్ ఎంప్లాయిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో "రోబోటిక్ అప్లికే షన్ల కోసం కస్టమ్ ఎంబెడెడ్ బోర్డ్‌ను అభివృద్ధి చేయడం" అనే అంశంపై యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ (యుసిఇకె) ప్రిన్సిపాల్ ఆఫీస్ సెమినార్ హాలులో మూడు రోజుల పాటు విద్యార్థులకు నిర్వహించిన ఉచిత శిక్షణా కార్యక్ర మం శనివారంతో ముగిసింది. ఐఐఐపి,టి డైరెక్టర్ ప్రొ బిటి కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమా నికి ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ వి రవీంద్రనాథ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. రీసోర్స్‌పర్సన్స్ జీకర్స్ ఎంప్లా యిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు డా ఎంఎ రాజా, ఆర్.భువనేశ్వరిలు విచ్చేశారు. ఈసిఈ విభా గం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా కె దుర్గా గంగా రావు కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. ఈ సంద ర్భం గా ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్ మాట్లా డుతూ జెఎన్‌టియుకె, అనుబంధ కళాశాలల విద్యా ర్థులకు

ఇటువంటి ఉచిత శిక్షణా కార్యక్రమం నిర్వ హిం చడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభు త్వం రోబోటిక్స్, ఐఓటి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తది తర సాంకేతిక కోర్సులలో విద్యార్థులకు ఉచితం గా శిక్షణ ఇచ్చేందుకు అధిక ప్రాధాన్యతను ఇస్తుంద న్నారు. విద్యార్థులు ఈ శిక్షణా కార్యక్రమాన్ని సద్విని యోగపర్చుకుని రోబోటిక్స్‌లో నేర్చుకున్న సాంకేతిక అంశాలు, కోడింగ్, నూతన ఆలోచన లతో మరిన్ని ఆవిష్కరణలు చేపట్టాలన్నారు. జెఎన్‌టియుకె ఆధ్వ ర్యంలో ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు చేప ట్టేం దుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇటువంటి శిక్ష ణా కార్యక్రమం ద్వారా విద్యార్థులు రోబోటిక్స్ సాం కేతికతను నేర్చుకోవడం అభినందనీయమన్నారు. రోబోటిక్ అప్లికేషన్‌లపై శిక్షణా కార్యక్రమం నిర్వ హించడానికి సహకరించిన జీకర్స్ ఎంప్లాయిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు డా ఎంఎ రాజా, ఆర్ భువనేశ్వరిలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ వి రవీంద్రనాథ్ విద్యార్థులు అభివృద్ధి చేసిన రోబోటిక్స్ నమూనాల వివరాలను అడిగి వాటి పనితీరును ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. అదేవిధంగా రోబోటిక్స్ శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు తాము నేర్చుకున్న అంశాలను, రూపొందించిన నమూనాల వివరాలను, అభిప్రా యాలను వెల్లడించారు. శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు ముఖ్యఅతిథి ప్రొ వి రవీంద్ర నాథ్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ ఉచిత శిక్షణా కార్యక్రమంలో యుసిఇకె అధ్యాపకులు, యుసిఇకె, ఐడియల్ ఇంజనీరింగ్ కాలేజీ, ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీ, ప్రైడా ఇంజనీరింగ్ కాలేజీల విద్యార్థులు తదితరులు హాజరయ్యారు.

కార్మికుల సంక్షేమానికి పెద్దపీట

- కర్నూలులో 100 పడకల ఆసుపత్రికి ప్రతిపాదనలు
- మరో 7 ఆసుపత్రులకు స్థలాల కేటాయింపు
- మంత్రి సుభాష్ వెల్లడి

విశాలాంధ్ర - అమలాపురం : తనను అత్యధిక మెజార్టీతో గెలిపించి, తమ గుండెల్లో పెట్టుకుని ఆశీస్సులు అందించిన రామచంద్రపురం నియోజకవర్గం ప్రజలకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మరోసారి కృతజ్ఞతలు తెలియ జేశారు. అసెంబ్లీ సాక్షిగా, రాష్ట్ర మంత్రివర్గం కొలువుతీరిన నిండు సభ వేదికగా మంత్రి తన ప్రజలపై ఉన్న మమకారాన్ని చాటుకున్నారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొన్న మంత్రి సుభాష్ మాట్లాడుతూ కార్మిక శాఖ ప్రగతి, కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పై మంత్రి సుభాష్ శనివారం అసెంబ్లీలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మికుల సంక్షేమం, వారికి అమలు చేస్తున్న సంక్షేమంపై దృష్టి సారించా మని మంత్రి వివరించారు. కర్నూలులో 100 పడ కల ఆసుపత్రి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపా మని, తణుకులో 30 పడకల ఆసుపత్రి నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. అచ్యుతాపురంలో 30 పడకల ఆసుపత్రి నిర్మాణం కోసం ఇటీవల శంకుస్థాపన చేశామన్నారు. గుంటూరు, పెనుగొండ, నెల్లూరు, శ్రీకాకుళంలో ఆసుపత్రుల నిర్మాణానికి స్థలాలు మం జూరు చేసామన్నారు. ఈఎస్ఐ కార్పొరేషన్‌కు అప్పగించిన విజయవాడ దగ్గరలోని గుణదల ఆసుపత్రిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్నామన్నారు. గత వైసిపి పాలనలో రూ.616 కోట్లు నిధులు ఉన్నప్పటికీ కార్మికుల సంక్షేమానికి వినియోగించలేదని విమర్శించారు. ఈఎస్ఐ నిబంధ నల ప్రకారం 20 వేల మంది కార్మికులు ఉన్నచోట మాత్రమే 30 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేసే అవకాశం ఉందని, తణుకులో 12,610 మంది మాత్రమే ఉన్నారని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. తణుకు పరిసర ప్రాంతాల్లో పలు పరిశ్రమలు, చేపల చెరువులు ఎక్కువగా ఉన్నందున కార్మికుల కోసం ఆ ప్రాంతంలో ఆసుపత్రి నిర్మాణానికి కృషి చేయాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు సూచించారు. గత ప్రభు త్వం కార్మిక శాఖను నిర్వీర్యం చేసి, గాలికి వదిలేసిం దని మంత్రి సుభాష్ ఎద్దేవా చేశారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని, స్పెషల్ డ్రైవ్ చేపట్టామన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల చాలామంది కార్మికులు మృత్యువాత పడ్డారని విచారం వ్యక్తం చేశారు. పూర్వ పరిస్థితి పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకుంటామని మంత్రి సుభాష్ హామీ ఇచ్చారు ఇచ్చారు. బాలలను పనిలో పెట్టుకుంటే వారిపై చట్టపకారం చర్యలు తీసుకుంటామని మంత్రి సుభాష్ హెచ్చరించారు.

జర్నలిస్టులకు సన్మానం

విశాలాంధ్ర - అమలాపురం : జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా శనివారం ఉదయం బులియన్ మార్కెట్ బిల్డింగ్‌లో అమలాపురం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు బోణం సత్యవరప్రసాద్ అధ్యక్షతన పాత్రికేయ మిత్రులకు సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సన్మాన గ్రహీతలు కొండేపూడి సత్యనారాయణ, పరసా సుబ్బారావు, కొర్లపాటి ప్రదీప్, మహ్మద్ బషీర్ చవ్వాకులు నాని, రంబాల సత్యనారాయణ, ఆకుల రవితేజ, జనిపిరెడ్డి సురేష్‌లను ఛాంబర్ అధ్యక్షులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఛాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ అధ్యక్షులు, అమలాపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు విచ్చేసి జర్నలిస్టుల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఛాంబర్ ఉపాధ్యక్షులు చిట్టూరి పెదబాబు, సెక్రటరి కొమ్మూరి వెంకటచల ప్రసాద్, ట్రెజరర్ దొమ్మేటి సాయిబాబు, ముఖ్య సలహాదారులు నల్లా పవన్ కుమార్, చింతలపూడి సత్తిబాబు, కంచిపల్లి అబ్బులు, బులియన్ మార్కెట్ అధ్యక్షులు మేడిచర్ల త్రిమూర్తులు, వాసిరెడ్డి సుబ్రహ్మణ్యేశ్వర రావు, ఆశెట్టి శ్రీను, అనుపోజు శీను, నమ్మిన వీరబాబు, మానే ప్రకాష్, అరిగెల నాని తదితరులు పాల్గొన్నారు.

18న సచివాలయాలకు తరలిరండి

విశాలాంధ్ర- నూజివీడు : అర్హులైన పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇళ్ల స్థలాలను కేటాయించాలని, ఇళ్ల నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలను మంజూరు చేయాలని కోరుతూ ఈనెల 18వ తేదీ రాష్ట్ర వ్యాప్తంగా ఇల్లు లేని పేదలు వ్యక్తిగతంగా అర్జీలతో గ్రామ, వార్డు సచివాలయాల వద్ద అధికారులకు అర్జీలు అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.కోటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. శనివారం నూజివీడు నియోజకవర్గంలోని సిద్దార్థ నగర్, లైన్ తండా, కొత్తూరు తండా, కుక్కల తండ,ఓగిరాల తండా, హటియా తండాల్లో కోటేశ్వరరావు ప్రచారం నిర్వహించి ఇల్లు లేని గిరిజన ప్రజలతో రచ్చబండ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాల్లో ప్రకటించిన నిరుపేదలకు సంబంధించి అత్యంత మౌలికమైన నివేశన స్థలాలు, ఇళ్ల నిర్మాణాలు తక్షణమే అమలుకు పూనుకోవాలన్న లక్ష్యంతో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీన సచివాలయంలో అర్జీలను అందించాలన్న కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ప్రభుత్వం వెంటనే సానుకూలంగా స్పందించి వాగ్దానాల అమలుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం,భూ పోరాట కమిటీ నాయకులు బాణావతు శ్రీను, బరోతు బజారు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక ఇబ్బందులు తొలగించాలి

విశాలాంధ్ర -భీమవరం: ఉచిత ఇసుక లోడింగ్ ఇబ్బందులను తొలగించేందుకు ట్రాన్స్‌పోర్టులు సమన్వయంతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. శనివారం వశిష్ట సమావేశ మందిరంలో కలెక్టర్ జిల్లాలోని ట్రాన్స్పోర్ట్ లతో సమావేశమై రీచ్‌ల వద్ద ఇసుక లోడింగ్ లో తలెత్తుతున్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏ రీచ్‌కి ఎన్ని వాహనాలు పంపిస్తున్నారు, వాహనం నెంబరు, డ్రైవర్ నెంబరు తదితర వివరాలను జిల్లా ఇసుక ఫెసిలిటేషన్ సెంటర్‌కు అందజేయాలని ట్రాన్స్పోర్ట్‌లకు తెలిపారు. ఫెసిలిటేషన్ సెంటర్ కు ఫోన్ చేసి ఇసుక రవాణకు వాహనం కోరిన ఇసుక వినియోగదారునితో టై అప్ చేసి రీచ్ నందు ఇసుక లోడింగ్‌లో సమస్యలు తలెత్తకుండా అక్కడ ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారి ద్వారా సమన్వయం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. నవంబర్ 4వ తేదీ నుండి నేటి వరకు 654 వాహనాల ద్వారా 14,100 టన్నుల ఇసుకను తూర్పుగోదావరి జిల్లా నుండి మన జిల్లాకు తరలించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్‌కలెక్టరు టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా రవాణా శాఖ అధికారి టి.ఉమామహేశ్వర రావు, పశ్చిమ గోదావరి జిల్లా లారీ యూనియన్ అధ్యక్షులు రావూరి రాజా, రాష్ట్ర వైస్ ప్రెసిడెంటు శిరిగినీడి శ్రీనివాసరావు, నాయకులు కోలా సత్యనారాయణ, కవురు నాగరాజు, పిండి శ్రీను, నక్కా సత్యనారాయణ, యాతం గణపతి, జె.ఆనంద్, శాండ్ టెక్నికల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రాణాలతో 'శ్రీచైతన్య' చెలగాటం

ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు శివకుమార్

విశాలాంధ్ర - ఏలూరు : విద్యార్థుల నుంచి ఫీజుల రూపంలో లక్షలు వసూలు చేసి సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు డి.శివకుమార్ విమర్శించారు. శుక్రవారం ఏలూరు నుండి ధర్మాజీగూడెం వెళ్లే దారిలో బస్సును ఆపి విద్యార్థులను వేరే బస్సులోకి తరలిస్తున్న సమయంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు అడ్డగించి విద్యార్థులను కాపాడారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులకు సరిపడా బస్సులు ఫిట్నెస్ లేకుండా కళాశాలకు తరలిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.శ్రీ చైతన్య కళాశాలకు చెందిన బస్సులలో పరిమితికి మించి అగ్గిపెట్టెలో పుల్లలు మాదిరిగా 60 మంది విద్యార్థులను ఒకే బస్సులో తీసుకువస్తూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఇళ్లకు వెళ్లడానికి బస్సు సదుపాయం కల్పించలేక పోతున్నారని విమర్శించారు. తక్షణమే శ్రీ చైతన్య కళాశాల యాజమాన్యం పై చర్యలు తీసుకొని విద్యార్థుల ప్రాణాలు కాపాడాలని శివకుమార్ డిమాండ్ చేసారు. లేనిపక్షంలో విద్యార్థుల ప్రాణాలను రక్షించడానికి ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

ఆర్టీసీలో సమయపాలనా మాసోత్సవాలు

విశాలాంధ్ర - అమలాపురం : ఏపీఎస్ ఆర్టీసీలో ఈనెల16 నుంచి డిసెంబర్ 15 వరకు సమయపాలనా మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని అధికారులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కోనసీమ జిల్లా ప్రజా రవాణాధికారి ఏ శ్రీనివాస రావు, అమలాపురం డిపో లో గేట్ మీటింగ్ పెట్టి సిబ్బందితో సమయపాలనా మాసో త్సవాల ప్రాముఖ్యత గురించి వివరించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రజలు మెరుగైన సౌకర్యాలను కోరుకుంటున్న నేపథ్యంలో సమయపాలన అనేది ముఖ్య పాత్ర పోషిస్తుందని, ప్రతీ డ్రైవర్‌తో చర్చించి బస్సుల్లో ఉన్న లోపాలను తెలుసు కొని వాటిని సరిచేసి, సరి చేసిన లోపాలను డ్రైవరుకి నమ్మ కం కలిగే విధంగా నోటీస్ బోర్డు ద్వారా తెలియచేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అమలాపురం డిపో మేనేజర్ సీహెచ్ఎస్ ఎన్ మూర్తి, ట్రాఫిక్‌ఇంచార్జీ, గ్యారేజ్ ఇంచార్జీతో పాటు ట్రాఫిక్, గ్యారేజ్ సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయాలి

విశాలాంధ్ర - కాకినాడ : కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలను వ్యతిరేకిస్తూ 13 కేంద్ర కార్మిక సంఘాలు, 500 రైతు సంఘాలు సంయుక్తంగా జిల్లా కేంద్రాలలో నవంబరు 26 దేశవ్యాప్త ధర్నా చేయాలని ఇచ్చిన పిలుపులో భాగంగా కాకినాడ కలెక్టరేట్ వద్ద పెద్ద సంఖ్యలో రైతులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ, మోడీ ప్రభుత్వం ముందు దేశవ్యాప్తంగా కార్మికులు రైతులు పదేళ్ల క్రితం పెట్టిన 15 డిమాండ్లలో ఏ ఒక్క కోర్కెను మోడీ ప్రభుత్వ నెరవేర్చలేదని విమర్శించారు. రైతులు కార్మికులు మరింత పేదరికంలోకి నెట్టబడడానికి మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలే కారణమని తెలియజేశారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని, ఏ రంగంలో పనిచేసే కార్మికుడికైనా ధరలకు అనుగుణంగా కనీస వేతనం 26 వేలు చెల్లించాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేసి కార్మికులను బానిసత్వం నుండి విడుదల చేయాలని, కౌలు రైతులకు భూ యజమానితో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పంట రుణాలు, నష్టపరిహారం చెల్లించాలని, ఉపాధి హామీ కార్మికులకు 200 రోజుల పని దినాలను కల్పించి రోజు వేతనం 600 చెల్లించాలని, విశాఖ ఉక్కు, రైల్వే, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలలో ఖాళీగా ఉన్న 18 లక్షల పోస్టులు నిరుద్యోగులతో తక్షణం భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 26 కాకినాడ కలక్టరేట్ వద్ద జరిగే కార్మిక కర్షక ఐక్య ధర్నాలో పెద్దసంఖ్యలో నిరుద్యోగులు, కార్మికులు, రైతులు, కౌలు రైతులు, ఉపాధి కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు తాళ్లూరి రాజు, ఐఎఫ్టియు జిల్లా సహాయ కార్యదర్శి ఆదినారాయణ, ఏఐసీసీటీయూ రాష్ట్ర కన్వీనర్ గొడుగు సత్యన్నారాయణ, మెడిశెట్టి వెంకట రమణ, టి.రాజా తదితరులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో గ్రంధాలయాల పాత్ర కీలకం

విశాలాంధ్ర - పిఠాపురం : సమాజ అభివృద్ధిలో గ్రంధాలయాలు పాత్ర కీలకమని బిఎంఆర్ బాలికోన్నత పాఠశాల సంగీత ఉపాధ్యాయురాలు శేషకుమారి తెలిపారు. విద్యార్థులు చిన్నతనం నుండి గ్రంధాలయాలను సందర్శించి గ్రంథ పఠనం చేస్తే తమను తామే తీర్చి దిద్దుకోవచ్చని మాట్లాడారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మూడవ రోజు శాఖ గ్రంధాలయం పిఠాపురంలో గ్రంధాలయ ఉద్యమకారుల సంస్మరణ సభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంతోమంది గ్రంధాలయ ఉద్యమకారులు ఫలితంగా ఈ గ్రంథాలయాలు నెలకొల్పబడ్డాయని, అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల హరి సర్వోత్తమరావు, వావిలాల గోపాలకృష్ణయ్య మొదలైన గ్రంథాలయ ఉద్యమ సారధులు కృషిఫలితంగా గ్రంథాలయ వ్యవస్థ ఏర్పడిందని తెలిపారు. విద్యార్థులకు దేశభక్తి గేయాలు, పాటలు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఆర్ వెంకట రాము, ఉపాధ్యాయులు వి సత్యప్రియ, కే శ్యామల వివిధ పాఠశాలల విద్యార్థులు గ్రంధాలయ పాఠకులు పాల్గొన్నారు.

ఏడాది లోపు అభివృద్ధిలో మార్పు చూపిస్తాం

– ఎంపీ పుట్టా మహేష్ కుమార్...

విశాలాంధ్ర–మండవల్లి/ముదినేపల్లి: రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఏడాదిలోపు అభివృద్ధిలో మార్పు చూపిస్తుందని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. మండవల్లి, ముదినేపల్లిలో శని వారం తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్య క్రమాన్ని ప్రారంభించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, స్థానిక ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే కమ్మిలి విఠల్ రావు పాల్గొన్నారు. నాయకులు, కార్యకర్తలతో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మాట్లాడారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ పనులు డిసెంబరులో, చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులు జనవరిలో ప్రారంభించ డానికి తమ ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని ఎంపీ తెలిపారు. జల్ శక్తి పథకంలో భాగంగా ప్రతి ఇంటికి తాగునీరు అందించడానికి తన వంతుగా కృషి చేస్తున్నట్లు ఎంపీ పేర్కొన్నారు. యువతకు ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత రాష్ట్రంలో యువ నేత లోకేష్, ఏలూరు పార్లమెంటు పరిధిలో తాను బాధ్యతలు తీసుకున్నట్లు ఎంపీ స్పష్టం చేశారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి మంత్రి లోకేష్ చొరవతో రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ఔత్సాహికులు ముందుకు వస్తున్నట్లు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వెల్లడిం చారు. టీడీపీ సభ్యత్వాలు పెంచడంపై నాయకులు, కార్యకర్తలు దృష్టి సారించాలని ఎంపీ సూచించారు. అత్యధిక సభ్యత్వాలు నమోదు చేసిన జాబితాలో కైకలూరు నియోజకవర్గం ప్రథమ స్థానంలో నిలవాలని శ్రేణులకు ఎంపీ విజ్ఞప్తి చేశారు. కార్యకర్తలు, నాయ కులు ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని ఎంపీ సూచించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి అధికారులతో కలిసి మండ లాల వారీగా సమావేశాలు నిర్వహించి అప్పటి కప్పుడు సమస్యలను పరిష్కరిం చేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు ఎంపీ స్పష్టం చేశారు.

బాల్య వివాహాల నిషేధ చట్టంపై అవగాహన

విశాలాంధ్ర–పెనుమంట్ర: బాల్య వివాహాలు నిషేధ చట్టం–2006 పై అందరూ అవగాహన కలిగి ఉండాలని, వివాహ వయస్సు రాని వారికి వివాహం జరగకుండా అడ్డుకోవడం చెయ్యాలని న్యాయవాది కె.స్వర్ణలత అన్నారు. శనివారం ఆలమూరు గ్రామంలోని డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు బాల్య వివాహాలు నిషేధ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమా నికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖ న్యాయవాది కె. స్వర్ణలత మాట్లా డుతూ బాల్యవివాహాల నిషేధ చట్టం, ఫోక్సో చట్టం, విద్యార్థులకు గుడ్డు టచ్–బ్యాడ్ టచ్, సైబర్ క్రైమ్, సామాజిక మాధ్యమాల పై అవగాహన కల్పించారు. సూపర్వైజర్ వెంకటలక్ష్మి, సిహెచ్ వి సత్యవతి, పాఠశాల ప్రధానో పాధ్యాయుడు సుబ్బారావు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భువనేశ్వర్‌లో నిర్వహించిన డీఎస్ఐఆర్ - సీఆర్టిడిహెచ్ కాన్ క్లేవ్

– 2024కి హాజరైన ఏపీ నిట్ బృందం

విశాలాంధ్ర తాడేపల్లిగూడెం: ఒడిస్సా రాష్ట్రంలోని భువనేశ్వర్ లోని సిఎస్ఐఆర్ – ఇనిస్టిట్యూట్ ఆఫ్ మినరల్స్ అండ్ మెటీరియల్స్ టెక్నాలజీలో ఈ నెల 13, 14 తేదీల్లో రెండు రోజులపాటు నిర్వహించిన డిఎస్ఐఆర్ – సిఆర్టిడిహెచ్ కాన్ క్లేవ్ 2024 జాతీయ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఏపీ నిట్ బృందం హాజరైంది. ఈ బృందానికి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన సహాయ ఆచార్యులు డాక్టర్ పెద్దపాటి శంకర్ సారథ్యం వహించారు. సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ పరిధిలోని డిపార్ట్మెంట్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (డిఎస్ఐఆర్) నిర్వహించిన ఈ కార్యక్రమంలో కామన్ రీసెర్చ్ అండ్ టెక్నాలజీ డెవలప్మెంట్ హబ్ (సిఆర్టిడిహెచ్)లు సాధించిన పురోగతిని నిర్వాహకులు చర్చించి, భవిష్యత్తులో చేపట్టనున్న ప్రణాళికలను తెలియజేయటంతోపాటు సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి పరిశ్రమ లను ప్రోత్సహించటమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశం. ఈ సమావేశానికి హాజరైన డిఎస్ఐఆర్ సైంటిస్ట్ –జీ, సిఆర్టిడి హెచ్ హెడ్ డాక్టర్ విపిన్ సి శుక్లా చేతులమీదుగా జ్ఞాపికను అందుకున్నారు. ఆచార్యులు శంకర్ ను ఏపీ నిట్ ఇంచార్జ్ డైరెక్టర్ ఆచార్యులు డాక్టర్ ఎన్.వి.రమణారావు, రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి, అసోసియేట్ డీన్ డాక్టర్ వి.సందీప్ ప్రత్యేకంగా అభినందించారు. పరిశోధక సహాయకులు ప్రశాంత్, నవనీత్ పాల్గొన్నారు.

భక్త జనసంద్రంగా వాడపల్లి క్షేత్రం

విశాలాంధ్ర – ఆత్రేయపురం : కలియుగ వైకుంఠం కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారికి శనివారం భక్తులు నీరాజనాలు సమర్పిం చారు. ఉదయం వేకువజామునే సుప్ర భాత సేవ అనంతరం స్వామివారికి నీరాజనం, మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమాలు అర్చక స్వాములు అంగరంగ వైభవంగా నిర్వహించి తదనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. రాష్ట్ర నలుమూలల నుంచి కాలినడకన వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణ మంతా కిక్కిరిసిపోయింది. వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్త కుండా ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం చక్రధర్ రావు ఏర్పాటును పూర్తి చేసి పర్యవేక్షించారు. ప్రసాద వితరణ, అన్నదానం నిర్వహించారు. ఆర్టీసీ అధికా రులు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏలేశ్వరం, ఏలూరు, రాజమహేం ద్రవరం, గోకవరం విజయవాడ, విశాఖ పట్నం నుండి ప్రత్యేక బస్సులు నడిపారు. శనివారం స్వామివారి ఆదాయం 36 లక్షలు మధ్యాహ్నం మూడు న్నర గంటల వరకు వచ్చిన ఆదాయం. ఆలయంలో నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. దేవస్థానం డిప్యూటీ కమిష నర్ నల్లం సూర్య చక్రధరరావు, వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఎస్ఐ ఎస్.రాము తన సిబ్బందితో ప్రతిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

ట్రావెల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

విశాలాంధ్ర – పెరవలి : పెరవలి మండలం నల్లకులవారిపాలెం గ్రామానికి చెందిన నల్లాకుల వెంకట నరసయ్య 48 సం॥లు తన ఇంటి వద్ద నుంచి శని వారం ఉదయం 6గంటలకు నల్లకులవారిపాలెం సెంటర్‌కి టీ తాగటానికి నడుచుకుంటూ వెళుతూ జాతీయ రహదారి దాటుచుండగా తణుకు వైపు నుండి రావులపాలెం వైపు వెళ్ళుచున్న మైత్రి ట్రావెల్ బస్సు సదరు నరసయ్యను ఢీ కొనడంతో అతని తలకు బలమైన గాయాలవ్వడంతో సంఘటన స్థలంలోనే అతను మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదు పై పెరవలి ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర పెంటపాడు : ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, దాతలు, సాంఘిక సేవా సంస్థలు గ్రంథాలయాల అభివృద్ధికి తోడ్పడాలని మానవతా పర్యావరణ పరిరక్షణ కమిటీ జిల్లా చైర్మన్ తాడేపల్లి మోహన్ రావు పేర్కొన్నారు.57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవముల సందర్భముగా శనివారం పెంటపాడు శాఖ గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇండియన్ ఐకాన్ నేషనల్ అవార్డు గ్రహీత,మానవతా పశ్చిమగోదావరి జిల్లా పర్యావరణ పరిరక్షణ కమిటీ చైర్మన్ తాడేపల్లి మోహన రావు, పాల్గొన్నారు. తొలుత గ్రంథాలయాల వ్యాప్తి కొరకు ఉద్యమించిన అయ్యంకి వెంకట రమ ణయ్య, డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్, పాతూరి నాగభూషణం వంటి మహాశయులకు నివాళులర్పించారు. అనం తరం మోహన్ రావు మాట్లాడుతూ గ్రంథాలయాల విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ప్రపంచ మేధావులైన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, అబ్దుల్ కలాం ఆజాద్ వంటి భారతీయులు, రోనాల్డ్, మిల్టన్, షేక్స్పియర్, వంటి మహ రచయితల అభివృద్ధికి గ్రంథా లయాలు ఎంతో దోహదం చేశాయని,ఈనాటి విద్యార్థులు కూడా గ్రంథాలయాల ద్వారా విజ్ఞానాన్ని సముపార్జించాలని కోరారు.పుస్తకం లేని గది–ఆత్మ లేని శరీరం వంటిదని,అందుచే ప్రతి ఒక్కరి గృహములో కనీసం చిన్నపాటి గ్రంథాల యాన్ని అయినా ఏర్పరచుకోవాలని కోరారు. ఈ విషయమై ప్రభుత్వంతో పాటు, స్థానిక సంస్థలు, దాతలు, సాంఘిక సేవా సంస్థలు, గ్రామ పెద్దలు ముందుకు వచ్చి గ్రంథాలయ అభివృద్ధికి తమ తోడ్పాటును అందించాలని ఆయన విన్న వించారు. ఈ కార్యక్రమంలో శాఖ గ్రంథాలయ అధికారి .జుల్ఫీకర్ అలీ,టీచర్లు శశి కపూర్, స్వరాజ్య, శ్రీనివాస్ మరియు గవర్నమెంట్ పోస్ట్ బేస్ పాఠశాల విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

పోలసానిపల్లి జోనల్ బాలికల క్రీడాపోటీలు

విశాలాంధ్ర–భీమడోలు: పోలసానిపల్లి బీఆర్ అంబే ద్కర్ సాంఘిక సంక్షేమ బాలి కల కళాశాలలో మూడవ రోజైన శనివారం నిర్వహిం చిన జోన్ 2 బాలికల గేమ్స్ అండ్ స్పోర్ట్స్ పోటీలు ఉల్లా సభరితమైన వాతావరణంలో హోరాహోరీగా సాగాయి. జోన్ పరిధి లోని ఉమ్మడి పశ్చిమగోదావరి, కృష్ణా, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన 29 కళాశాలలకు చెందిన 1,050 మంది బాలికలు వివిధ క్రీడా పోటీల్లో తమ సత్తా చాటారు. పోటీలకు హాజరైన బాలికలు రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడా కారులున్నందున వారంతా పోటీల్లో అత్యుత్తమ ప్రతిభను చాటారు. పలు అంశాల్లో ఫైనల్ పోటీలు నిర్వహించి విజేతలను ప్రకటించారు. కబడ్డీ, ఖోఖో, హ్యాండ్ బాల్, చెస్,తదితర పోటీలు సెమీఫైనల్స్, ఫైనల్స్ నిర్వహిం చారు. జోన్ స్పోర్ట్స్ మీట్ కోఆర్డినేటర్ శ్యామల,జిల్లా కోఆర్డినేటర్ ఎన్. భారతి, ప్రిన్సిపల్ వీవీ రమణ విజేతలను ప్రకటించారు. ఈనెల 17న జోనల్ పోటీలు ముగుస్తాయని సంబంధిత అధికారులు తెలిపారు. పీడీ సాయిలక్ష్మి, విజయలక్ష్మి 60 మంది పీడీ, పోటీలను పర్యవేక్షించారు.

గ్రంథాలయ ఉద్యమం

విశాలాంధ్ర – కొవ్వూరు : కొవ్వూరు ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయములో నిర్వహిం చుచున్న 57 వ జాతీయ గ్రం థాలయ వారోత్స వాలలో భాగంగా ది.16-11-2024 న గ్రంథాలయ అభివృద్ధి కారకులయిన పద్మశ్రీ అయ్యంకి వెంకట రమ ణయ్య, గ్రంథాలయ శాస్త్రంలో విశేష కృషి చేసిన డా.ఎస్.ఆర్. రంగనాథన్, గ్రంథాలయ ఉద్యమకారుడు నాగభూషణం వారిని స్మరిం చుకున్నారు. గ్రంథా లయాలను స్థాపించుటకు కృషి చేసిన వ్యక్తి అయ్యం కి వెంకట రమణయ్య, గ్రంథాలయ పితామహు డుగా పేరుగాం చారని, గ్రంథాలయ శాస్త్రంలో విశేష కృషి చేసి గ్రంథాలయ పంచసూత్రాలను రూపొందించిన వ్యక్తి డా.ఎస్.ఆర్. రంగనాథన్, చిన్నతనం నుండి గ్రంథాలయా లను ప్రజల్లోకి తీసుకొని వెళ్ళడానికి కృషి చేసిన వ్యక్తి పాతూరి నాగభూషణం అని తెలిపారు. గ్రంథాలయ ఉద్యోగులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, వివిధ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులను పరిష్కరించాలి

విశాలాంధ్ర- ఏలూరు: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) ద్వారా అందిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని రాజమహేంద్రవరం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్-కం-అప్పిలేట్ కమిషనర్ నాగనరసింహారావు ఆదేశించారు. ఏలూరు నగరపాలక సంస్థ కార్యాల యంలో శనివారం జిల్లాలోని నగరపాలక సంస్థ, పురపాలక సంఘ,నగర పంచాయతీ కమిషనర్లు, సిబ్బందితో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టమ్, రెవెన్యూ వసూళ్ళు,15వ ఫైనాన్స్ కమిషన్ ఫండ్స్ యుటిలైజేషన్, పాట్ హోల్స్ ఫ్రీ రోడ్స్,తదితర అంశాల ప్రగతిపై సమీక్షా సమావేశం నిర్వహిం చారు. నాగనారసింహారావు మాట్లాడుతూ పీజీఆర్ ఎస్ ద్వారా అందే దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధా న్యత ఇవ్వాలని, ముఖ్యంగా ప్రజల నుండి పౌర సౌకర్యాల సమస్యలపై అందే సమస్యలను ప్రాధాన్య తను ఇచ్చి పరిష్కరించాలన్నారు.పట్టణ పరిధిలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన మేరకు పాట్ హోల్స్ ఫ్రీ రోడ్స్ ఉండేలా రోడ్లకు మరమ్మత్తులు చేయించాలన్నారు.ఆస్థి పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలన్నారు. ఈ సమీక్ష సమావేశము నందు ఎ.భాను ప్రతాప్, కమిషనర్, నగరపాలక సంస్థ, జి.చంద్రయ్య, అదనపు కమిషనర్, నగరపాలక సంస్థ, ఏలూరు, బి.శివారెడ్డి, డిప్యూటీ కమిషనర్, నగరపాలక సంస్థ,ఏలూరు, టి.పావని, చింతల పూడి మున్సిపల్ కమిషనర్, కె.వెంకట రమణ, జంగారెడ్డి గూడెం మున్సిపల్ కమిషనర్, వెంకట రామి రెడ్డి, నూజివీడు మున్సిపల్ కమిషనర్, పాల్గొన్నారు.

క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ వారిహర రాజుకు సత్కారం

విశాలాంధ్ర-వీరవాసరం: కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు నిరంతరం కృషి చేసిన వ్యక్తులను కూటమి ప్రభుత్వం గుర్తించి తగిన బాధ్యతలను అందిస్తుందని పలువురు నాయకులు తెలిపారు. రాష్ట్ర క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులైన యరకరాజు సత్య వారిహరరాజును కూటమి నాయకుల ఆధ్వర్యంలో శనివారం మండలంలోని కొణితివాడ ఆయన నివాసంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సౌమ్యుడు పార్టీ కోసం నిరంతరం కృషి చేసిన హరిహర రాజుకు క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పదవి ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ వారిహరరాజు మాట్లాడుతూ ప్రజారాజ్యం పార్టీ నుంచి రాజకీయాల్లో ఉన్నానని, జనసేన విజయమేనా లక్ష్యంగా 2019, 2024లో కూడా కృషి చేశానని, 2024 లో విజయం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని, నాకు అందించిన క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి పూర్తి న్యాయం చేస్తానని అన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షులు జవ్వాది బాలాజీ, యరకరాజు గోపాల కృష్ణంరాజు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చెన్న మల్లేశ్వర స్వామి దర్శించుకున్న సీఐ జగదీశ్వరరావు

విశాలాంధ్ర-ఉండి : మండల కేంద్రమైన ఉండి రాజుల పేటలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ పార్వతీ సమేత చెన్న మల్లేశ్వర స్వామిని కార్తీక మాసం పురస్కరించుకొని ఆకివీడు సర్కిల్ ఇన్స్పెక్టర్ జగదీశ్వరరావు సతీసమేతంగా శనివారం దర్శించుకున్నారు. జగదీశ్వరరావు దంపతులకు ఆలయ అర్చకులు సన్నిధి రాజు చలపతి సాదర స్వాగతం పలికారు. జగదీశ్వరరావు దంపతులు వేద మంత్రోచరణ నడుమ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివనామ స్మరణం జపించారు. ఈ సందర్భంగా జగదీశ్వరరావు మాట్లాడుతూ యువత భక్తి భావం కలిగి ఉండాలన్నారు. చెడు వ్యసనాలకు అసంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలంతా కార్తీక్ మాసంలో నిష్టతో దేవదేవుని పూజించటం హర్షినియమన్నారు. ప్రజలు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, పాడిపంటలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

కార్తీక వన సమారాధన

విశాలాంధ్ర-దేవర పల్లి: దేవరపల్లి జగ ద్గురు శ్రీశ్రీశ్రీ ఆది శంకరా చార్య ధ్యాన మందిరం మహిళా కమిటీ చాలా అంద రం సభ్యులు శనివారం కార్తీక వన సమారాధన చేశారు. దేవరపల్లికి చెందిన అంబటి జయలక్ష్మి కొబ్బరి తోటలో దామోదర్ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా కమిటీ సభ్యులు సౌందర్యలహరి లలిత సహస్ర నామ పారాయణ చేశారు అనంతరం కార్తీక మన సమారాధన నిర్వహించారు. జగద్గురు శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్య ధ్యాన మందిరం కమిటీ చైర్మన్ చలంచర్ల వీర వెంకట హరినాథ్ ప్రధాన కార్యదర్శి తోట సత్యనారాయణ ఉపాధ్యక్షుడు నారాయణ విశ్వేశ్వర రావు సహాయ కార్యదర్శి చిరపురి సత్యనారాయణ గౌరవ సలహాదా విష్ణుభట్ల రామారావు ఎస్బిఐ శాఖ మాజీ ఏ డి ఏ కేశిరాజు సీతారామయ్య సౌందర్యలహరి సౌందర్యలహరి పారాయణ మహిళా కమిటీ సభ్యులు నారా యణ లక్ష్మీ రాణి చిరువూరి బేబీ అంబటి జయలక్ష్మి కొండేపాటి పావని ఉప్పల పాటి పద్మావతి కరుటూరి సత్యవాణి ఉప్పలపాటి ప్రసన్న ముళ్ళపూడి వెంకట రమణ పొట్ల కుమారి వెలగా సుబ్బలక్ష్మి వెలగ తయారు చలంచర్ల ఉదయలక్ష్మి వి రాధ చిరపూరి సుబ్బలక్ష్మి బలుసు విజయలక్ష్మి పడాల ఇందిరా ప్రియదర్శి నర్రా లక్ష్మీనరసింహ స్థానిక ప్రముఖులు కొండపల్లి సత్యనారాయణ వెలగా శ్రీనివాస్ బలుసు సత్యనారాయణ మెల్లగా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. పరమేశు బయోటెక్ మొక్కజొన్న ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్ శివప్రసాద్ను సౌందర్యలహరి పారాయణం కమిటీ సభ్యులు జగద్గురు శ్రీశ్రీశ్రీ అది శంకరాచార్య ధ్యాన కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి

విశాలాంధ్ర-ఏలూరు: స్వభావ స్వచ్ఛత సంస్కార స్వచ్ఛత ఇతివృత్తంగా స్వచ్ఛతాహీ సేవా-2024 ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో చేపట్టి పరిశుభ్రత, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సృష్టించు కోవాలని జిల్లా రెవిన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు అన్నారు. శనివారం కలెక్టరేట్ ఆవరణంలో అల్లూరి సీతారామ రాజు విగ్రహం వద్ద స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని కలెక్టరేట్ సిబ్బందితో చేపట్టారు.ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ మన ఇంటి పరిశుభ్రతలే కాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అదే విధంగా ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా పరిశుభ్రతతో నిండివుండాలని తెలిపారు. శనివారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. ఈ సందర్భంగా ఆవరణలో ఉన్న అల్లూరి సీతారామరాజును స్మరించుకుంటూ వారి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్, కలెక్టరేట్ కార్యాలయ ఏవో నాంచారయ్య, పరిపాలనా విభాగం సూపరింటెండెంట్లు,కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్య విజ్ఞాన సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-దేవరపల్లి: వైద్య విజ్ఞాన సదస్సులను సద్వినియం చేసుకొని వృత్తిని నైపుణ్యాన్ని మరింత పెంపొందించు కోవాలి అని కమ్యూనిటీ పారామెడి కల్స్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు బల్ల శ్రీనివాసరావు అన్నారు దేవరపల్లి లో విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అసోసియేషన్ భవనంలో శనివారం నాడు రాజమహేంద్ర వరం గంగ హాస్పటల్ ఆధ్వర్యంలో దేవరపల్లి మండల పీఎంపీల అసోసియే షన్ సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న బల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ వైద్యులు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకొని గ్రామాలలో రోగులకు మరిన్ని సేవలు అందించాలని అన్నారు ప్రాథమిక స్థాయిలో పీఎంపీ వైద్యులు చేస్తున్న సేవలు మరువలేనివని ఆయన అన్నారు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి దేవానంద్ మాట్లాడుతూ దేవరపల్లి మండలంలో నూతన పీఎంపీల అసోసియేషన్ ఏర్పాటు ఎంతో అభినందనీయ మన్నారు. దేవరపల్లి మండల పి ఎం పి అసోసియేషన్ అధ్యక్షునిగా బంధ పురం గ్రామానికి చెందిన ఆకుల నాగేశ్వరరావు ఎన్నికయ్యారు కార్యదర్శిగా దాసరి సత్య భాస్కరరావు కోశాధికారిగా చింతలపాటి ప్రసాద్ రాజు ఉపాధ్యక్షునిగా మామిడిపల్లి వెంకటరావు సహాయ కార్యదర్శిగా మంద లపు బాలసుబ్రమణ్యం గౌరవ అధ్యక్షునిగా చాపల కామరాజు చాపల కామరాజు ఏడుగురు సభ్యులతో కమిటీ ఏర్పడింది కమిటీ సభ్యులుగా ఎంఎస్ శ్రీనివాస రావు కే రాణి వెంకట సురేష్ వెంకట సురేష్ ఎం అప్పారావు చంద్రరావు సత్యనారాయణ జె ఆర్ ప్రసాద్ కమిటీ సభ్య లుగా ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. సభ్యులను కమిటీని జిల్లా అధ్యక్షుడు బల్ల శ్రీనివాస కార్యదర్శి దేవానంద్ అభినందించారు రాజమహేంద్రవరం గంగ హాస్పటల్ డాక్టర్ పరమాంస స్పందన మార్కెటింగ్ మేనేజర్ రుక్మంగ తారావు ఈ సదస్సులో పాల్గొని డాక్టర్లకు సూచనలు సలహాలు వివరించి గంగ హాస్పిటల్ విశిష్టతను తెలిపారు నూతన కమిటీ సభ్యులను గంగా హాస్పిటల్ డాక్టర్లు అభినందించారు ఈ కార్యక్రమంలో మండలంలోని పీఎంపీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.